# అంజలి (నాటిక)

## రచన : ఆకెళ్ళ

*Akella*
Film Script Writer,
207, R.K. Residency,
B.S.P. Colony, Mothinagar,
Hyderabad - 500114.
Land : 040 - 23834477
Cell : 94400 54477
Email : akellawriter@gmail.com

హామీ పత్రం

ఈ "అంజలి" నాటిక ఏ ఇతర రచనలకు అనువాదం కానీ, అనుసరణ కాదు. నా స్వంత రచన.

ఆకెళ్ళ

# అంజలి

(నాటిక)

# అంజలి

(నాటిక)

## పాత్రలు

| | | | |
|---|---|---|---|
| 1. | జే.కె. | : | కోటీశ్వరుడు (54 ఏళ్ళు) |
| 2. | ప్రభ | : | జే కె భార్య (44 ఏళ్ళు) |
| 3. | వేణు | : | జే.కె. కుమారుడు (18 ఏళ్ళు) |
| 4. | శివ | : | జే.కె. డ్రైవర్ (50 ఏళ్ళు) |
| 5. | పద్దాలు | : | డ్రైవర్ శివ భార్య |
| 6. | అంజలి | : | 10 ఏళ్ళ పిల్ల |
| 7. | సి.ఐ. | : | పోలీస్ ఇన్స్పెక్టర్ |
| 8. | ప్రతాప్ | : | సబ్ ఇన్స్పెక్టర్ |
| 9. | రైటర్ | : | పోలీసు రైటర్ |
| 10. | ఏసుపాదం | : | పాస్టర్ |
| 11. | బంగార్రాజు | : | భూతవైద్యుడు |

# అంజలి

(నాటిక)

## సీన్ నెం.1

వేణు పరుగెత్తుకొచ్చాడు. ఎవరూ సావిట్లో లేరు. సావిడి విశాలంగా, రిచ్‌గా ఉంది. సోఫాలో కూర్చుని మొహం అద్దుకున్నాడు. ఊపిరి పీల్చి వదులుతున్నాడు. బయట కారు శబ్ధం అయింది. ఉలిక్కిపడి దొంగలాగా దాక్కొని చూశాడు. ఎవరో అర్థం కాలేదు. ఇంకాస్త టెన్షన్ పడ్డాడు. ఈలోపుగా డ్రైవర్ శివ పెట్టెపట్టుకొని వచ్చాడు. వెనకాలే జే.కే వస్తాడు. శివ బయటికి వెళ్ళాడు.

జే.కె. : హాయ్ వేణు, ఎలాఉంది నీ కొత్త బెంజ్ కారు?

వేణు : (ఏం మాట్లాడలేదు)

జే.కే. : ఎనీ థింగ్ రాంగ్! విత్ యు?

వేణు : చిన్న ప్రాబ్లమ్ వచ్చింది డాడీ!

జే.కే. : కమాన్.. ప్రాబ్లమ్ ఏంటో చెప్పు! ప్రాబ్లమ్‌ని షూట్ చేసేద్దాం!

వేణు : ఇంజనీరింగ్ కాలేజ్ సెంటర్ దాటిన తర్వాత, యాక్సిడెంట్ అయింది. మన కారుకింద ఎవరో పడ్డారు.

జే.కే : స్టుపిడ్ ఫెలోస్! రోడ్డుమీద నడవడం కూడా రాదు వెధవలకి! చచ్చాడా.. బతికాడా?

వేణు : నేను చూళ్ళేదు డాడీ!

జే.కే. : డోంట్ వర్రీ! ఏదైతేనేంలే! ఇట్ ఈజ్ ఏన్ యాక్సిడెంట్!

వేణు : ఎస్! ఇట్ ఈజ్ ఏన్ యాక్సిడెంట్. జనం తక్కువే ఉన్నారని 200 స్పీడ్‌లో వెళ్లాను. ఎవరో అడ్డం వచ్చారు. నేను చూళ్ళేదు. ఎవరో పడ్డట్టుగా అనిపించింది. ఆపి చూస్తే ఏం తెలియలేదు. జనం పరుగెత్తుకుంటూ నాకేసి వస్తున్నారు. వెంటనే ఏం చేయాలో తోచలేదు. కారు స్టార్ట్‌చేశాను. స్పీడ్‌గా వచ్చేశాను.

జే.కే. : గుడ్, యు హ్యావ్ డన్ ఆన్ ఎక్సలెంట్ జాబ్!

వేణు : కారుకింద పడ్డ మనిషికి ఏదైనా అయితే పెద్ద గొడవవుతుందేమో!

జే.కే. : పెద్ద గొడవైతే, పెద్ద ఎమౌంట్ ఖర్చవుతుంది అంతేగా!

వేణు : కేస్ బుక్ చేస్తారేమో డాడీ!

జే.కే. : బుక్ చేస్తారు. మనిషి కారుకింద పడ్డతర్వాత కేసు లేకుండా ఎలా ఉంటుంది? అయితే కారు నడిపింది నువ్వు కాదుగా!

వేణు : నేను కాదా! మరెవరు?

జే.కే. : శివ! మన డ్రైవర్. సాయంత్రం నుంచి నువ్వు నాతోనే వున్నావ్! బెంజ్ నడిపింది శివ. ఓకె, నువ్వెళ్లి రెస్ట్ తీసుకో!

ప్రభ : (ప్రవేశించి, మాల తిప్పుతూ) హరే కృష్ణ, హరే కృష్ణ క్రిష్ణ క్రిష్ణ హరే హరే! వేణూ నువ్వొచ్చి ఎంతసేపయింది?

వేణు : ఇప్పుడేనమ్మా!

ప్రభ : ఇస్కాన్ టెంపుల్‌కి డొనేషన్ ఇచ్చొచ్చావా?

వేణు : అక్కడికి వెళ్ళబోతుంటేనే...

జే.కే. : నేను ఫోన్ చేసి ఇంటికి రమ్మన్నాను. రేపివ్వచ్చులే!

ప్రభ : ఇవ్వాళ వాడి పుట్టినరోజయితే, రేపు ఇవ్వడమేంటి. (చెంపలేసుకుంటూ) క్రిష్ణ, క్రిష్ణ! ఆ క్రిష్ణ పరమాత్మ మనకిచ్చింది పదిమందితో పంచుకోమనే! పైసాకు పరమార్థం పంచుకోవడమే!

జే.కే. : సరె..సరే.. వెళ్ళు! మాలతిప్పుకుంటూ భజన చేసుకో!

ప్రభ : వేణూ.. చెక్ ఇవ్వడం మర్చిపోకు!

వేణు : అలాగేనమ్మా!

ప్రభ : క్రిష్ణ.. క్రిష్ణా! (అంటూ వెళ్ళింది లోనికి)

జే.కే. : మంచి పనిచేశావ్! మీ మమ్మీకి యాక్సిడెంట్ విషయం చెప్పలేదు!

వేణు : డాడీ! నేనంత అమాయకుణ్ణేం కాదు!

జే.కే. : గుడ్! వెళ్ళి రిలాక్సవ్! అన్నట్టూ కారు కీస్ ఇచ్చివెళ్ళు!

వేణు : (కీస్ ఇచ్చి లోపలికి వెళ్లాడు)

జే.కే. : (సిగరెట్ వెలిగించుకొని ఓ దమ్ములాగి, ఓ నిముషం ఆలోచించి) శివా!

శివ : (చేతులు కట్టుకొని లోనికొచ్చి, బాస్ సిగరెట్ తాగడం చూసి, ఆష్ ట్రే తీసుకొచ్చి జే.కే. ముందు పట్టుకున్నాడు.)

జే.కే. : (సిగిరెట్ నుశి రాల్చాడు) బాబు ఇంజినీరింగ్ కాలేజ్ దగ్గర యాక్సిడెంట్ చేశాడు. ఎవరో కారుకింద పడ్డారట!

శివ : అయ్యో పాపం!

జే.కే. : అదే నేనూ అంటున్నాను. చిన్న పిల్లాడు, చదువుకోవలసినవాడు, పోలీసులూ, కేసులూ అంటూ తిరగటం చాలా కష్టం!

శివ : నిజమేనండి!

జే.కే. : (యాష్ ట్రేలో నుసి రాలుస్తూ) ఆ కేసు నీమీద వేసుకో! నీ గురించి నేను చూసుకుంటాను.

శివ : సార్!

జే.కే. : నువ్వేం వర్రీ కాకు! నీ జీతం రెట్టింపవుతుంది, ఏ ఇబ్బంది లేకుండా నీ కుటుంబాన్ని నేను ఆదుకుంటాను. ఇదిగో కారు కీస్ (చేతిలో పెట్టబోయాడు)

శివ : సార్! శిక్ష ఎంతకాలం పడుతుందో?

జే.కే. : నువ్వేం కంగారు పడకు, నీవెనకే పోలీస్ స్టేషన్‌కి మన లాయర్లు వస్తారు. బెయిల్ మీద నిన్ను బైటకు తెస్తారు. వీలైనంత తక్కువ శిక్ష పడేలా చూస్తారు, ఓ.కే?

శివ : (ఏం మాట్లాడడు)

జే.కే. : ఏంటాలోచిస్తున్నావ్? కాదంటే ఇప్పుడే చెప్పు, మరొకరికి ఫోన్ చేస్తాను, పరుగెత్తుకుంటూ వస్తారు!

శివ : అలాగే సార్! యాక్సిడెంట్ చేసింది నేనే!

జే.కే. : గుడ్! ఖర్చులకి ఈ డబ్బుంచు! (తాళాలు, డబ్బు ఇచ్చాడు)

(ఫోన్ మోగింది)

ఎవరూ? సెక్యూరిటా.. చెప్పు! పోలీసులా.. సరే, పంపించు!

(శివతో) నువ్వెళ్ళి బయట ఉండు. శివ L.F కేసి వెళ్లాడు S.I, R.F నుంచి వచ్చాడు.

ఎస్.ఐ : నమస్తే జే.కే. సార్!

జే.కే. : నన్ను ఇదివరకు కలిసేవా?

ఎస్ఐ : మా పోలీస్ ఫండ్ మీరు ఐదు లక్షలిచ్చారు కదసార్! అప్పుడు మా సంఘానికి నేనే జాయింట్ సెక్రటరీ సార్!

జే.కే. : ఓకే, గుడ్!

ఎస్.ఐ. : బయట వున్న బెంజ్ కారు మనదేనా సార్!

జే.కే. : అవును; ఎనీ ప్రాబ్లమ్?

ఎస్ఐ : ఎస్! ఆ కారు కొద్దిసేపటి క్రితం కాలేజ్ రోడ్డులో యాక్సిడెంట్ చేసింది. కారు మీరే నడిపారా?

జే.కే. : కాదు, నాకారు **BMW** అది బెంజ్! డ్రైవర్ నడుపుతాడు.

ఎస్ఐ : అతని పేరు?

జే.కే. : శివ! పిలుస్తానుండండి! శివా!

(శివ వచ్చాడు)

బెంజ్‌కారు యాక్సిడెంట్ చేసావట! ఎవర్నో గుద్దావట?

శివ : నేను స్లోగానే వెళ్తున్నాను సార్! అనుకోకుండా ఎవరో అడ్డం వచ్చారు!

ఎస్ఐ : రెండొందల్లో వెళ్లావ్! అది స్లోనా?

శివ : అంత స్పీడ్‌లో నేను వెళ్ళానా?

ఎస్ఐ : కొత్తకారు కదా! ఒళ్లు తెలియకుండా నడిపుంటావ్! సరే, అవన్నీ స్టేషన్‌లో చూసుకుందాం పదా!

జే.కే. : ఎస్ఐ గారు మనకు తెలుసు, నో ప్రాబ్లమ్, వెళ్ళు!

శివ : అలాగే సార్!

జే.కే. : క్యారీ ఆన్! (ఎస్ఐ, శివ వెళ్తారు)

వేణు : (వెళ్తున్నవాళ్ళను చూస్తూ వచ్చి) ఇంత స్పీడ్‌గా పోలీసులు వచ్చారేంటి?

జే.కే. : నో ప్రాబ్లమ్, అంతా సెటిల్ చేశాను. ఎస్ఐ మన చేతిలో మనిషే. (ఫోన్ రింగయింది.) హలో.. హాయ్ జేపీ బిజినెస్ ఎలా ఉంది? వేణు బాగానే ఉన్నాడు. ఆ.. శ్రీరాం కాలేజ్ ... యా ఏంటీ? వెంటనే ఢిల్లీ వస్తే పని జరుగుతుందా? ఓకే, పంపిస్తాను. నో ప్రాబ్లమ్! (ఫోన్ కట్‌చేసి, కొడుకుతో) అంకుల్ ఫోన్ చేశాడు. శ్రీరాం కామర్స్ కాలేజీలో నీకు సీటు వచ్చే అవకాశం వుందట! వెంటనే పంపమన్నాడు.

వేణు : అయితే రేపు మార్నింగ్ ఫ్లయిట్‌కి వెళతాను!

జే.కే. : గుడ్, కానీ అంత డిలే ఎందుకు? ఈరోజు లాస్ట్ ఫ్లయిట్‌కెళ్ళు!

వేణు : (ఆలోచించి) అలాగే డాడీ!

జే.కే. : నేను టికెట్ అరేంజ్ చేస్తాను. నువ్వు ఎయిర్‌పోర్ట్ కెళ్ళడానికి రెడీకా!

(వేణు లోనికెళ్ళాడు)

జే.కే. : (ఫోన్‌లో) హలో టైం లైన్ ట్రావెల్స్? ఆc.. ప్రభాకర్ నమస్తే! ఈ రోజు లాస్ట్ ఫ్లయిట్ కి వేణు ఢిల్లీ వెళ్ళాలి. టైంకొచ్చేస్తాడు. ఎస్! డూ ఇట్ ఇమ్మీడియట్లీ! (ఫోన్ కట్ చేశాడు)

ప్రభ : (వచ్చి, ఎల్.ఎఫ్ కేసి చూస్తూ) క్రిష్ణ.. క్రిష్ణ.. మన శివని పోలీసులు తీసుకెళ్తున్నారేంటి?

జే.కే. : షాక్! (సర్దుకొని) పోలీసులు ఒక అడ్రస్ అడిగితే చూపించమని నేనే డ్రైవర్‌ని పంపాను.

ప్రభ : మన బెంజ్ కారు చుట్టూ పరీక్షగా చూస్తూ తిరుగుతున్నారు.

జే.కే. : కొత్త మోడల్ కదా! చిత్రంగా చూస్తున్నారేమో! నీకన్నీ ఆశ్చర్యమే! (ఫోన్ మోగింది) ఎస్, కన్ఫం అయిందా టికెట్! గుడ్ బయలుదేరుతున్నాడు.

ప్రభ : ఎవరూ.. ఎక్కడికెళ్తున్నారు?

జే.కే. : మన వేణూకి ఢిల్లీలో సీటొచ్చేలాగుంది. దానికోసం వెళ్తున్నాడు.

ప్రభ : క్రిష్ణా.. క్రిష్ణా.. నీదయ కలిగిందా స్వామీ!

జే.కే. : అవును, నేను ఎంతో డొనేషన్ కడితేనే వచ్చింది...నీ క్రిష్ణుడు దయవల్ల కాదు!

ప్రభ : మీరలా వేళాకోళం చేయకండి, ఆయన దయ లేకుండా డొనేషన్ ఇచ్చినా పని జరగదు!

జే.కే. : అదే నేనూ అంటున్నాన్లే!

వేణు : (వచ్చి) అమ్మా! నేను ఢిల్లీ వెళ్తున్నానమ్మా!

ప్రభ : అదే డాడీ చెబుతున్నారు. డిన్నరన్నా చెయ్యకుండా ఈ కంగారు ప్రయాణాలేంట్రా?

వేణు : ఫ్లయిట్‌లో తింటాలేమ్మా! (వెళ్ళేడు)

ప్రభ : మీరైనా భోంచేస్తే వంటమనిషి వెళ్ళిపోతుంది! (వెళుతుంది)

జే.కే. : (నంబర్ చూసి) హాయ్ ప్రియా! ఏంటి నేను గుర్తుకొచ్చాను? (నవ్వేడు) అసలు ఈరోజు చెన్నై వచ్చి మీ హోటల్ లోనే దిగాలనుకున్నాను. బట్ నాకు బాధ్యతలున్నాయ్! యా... నీ వయసు కొడుకున్నాడు. ఇట్ ఈజ్ ఏ ఫ్యాక్ట్... నిజంరా.. నా స్టామినా వల్ల నీకలా అనిపించడం లేదు? (ఫోన్ లోకల్‌ది మోగింది) ప్రియా.. జస్ట్ ఎ మినిట్! హలో.. ఏంటీ? పోలీసులా? మళ్ళీ వచ్చారా? పంపించు! (ఆలోచించి, ఓ నిర్ణయానికొచ్చి) ప్రియా.. ఐ విల్ కాల్ యూ బ్యాక్, గుడ్‌నైట్! ఆc.. వీలుంటే రాత్రికి చేస్తా... (కట్ చేసాడు ఫోన్)

సీఐ : గుడీవినింగ్ సార్!

జే.కే. : వేళగాని వేళ వచ్చారు... ఎనీ ప్రాబ్లమ్?

సీఐ : ఎస్ సార్! వెరీ సీరియెస్ ప్రాబ్లమ్! మీ అబ్బాయి వేణు యాక్సిడెంట్ చేసాడు. 200 స్పీడ్‌లో కారు నడుపుతూ ఒక చిన్న పిల్లని కారుకింద లాక్కొని పోయాడు.

జే.కే. : (షాక్ తిని, కంపోజై) మీరేదో పొరబడుతున్నారు. యాక్సిడెంట్ చేసింది నా కారు డ్రైవర్ శివ. ఆ మాట అతనే ఒప్పుకున్నాడు. ఎస్.ఐ. అరెస్ట్ చేసి తీసుకెళ్ళాడు. మాటర్ ఈజ్ క్లోజ్డ్.

సీఐ : యూ ఆర్ రాంగ్! మేటర్ ఈజ్ నాట్ క్లోజ్డ్.

జే.కే. : హౌ డేర్ యు స్పీక్ టు మి దట్ వే!

సీఐ : జేకే గారూ! హుc మీబోటి డబ్బున్నవాళ్ళకోసం జైలుకెళ్ళడానికి పదిమంది డ్రైవర్లు రెడీగా ఉంటారు. నా సర్వీస్ లో ఇలాంటి కేసులెన్నో చూసాను. జరిగిందేమిటంటే..కారు నడిపింది మిస్టర్ వేణు. యాక్సిడెంట్ చేసింది మిస్టర్ వేణు. వెంటనే కారు తీసుకొని పారిపోయిందీ వేణు. ఇట్ ఈజ్ ఎ క్లియర్ కట్ కేస్ ఆఫ్ హిట్ అండ్ రన్. దానికి శిక్ష కూడా ఎక్కువుంటుంది.

జే.కే. : ఇట్ ఈజ్ ఆల్ ట్రాష్! డూ యూ హ్యావ్ ఎనీ ప్రూఫ్?

సీఐ : ఐ కెన్ ప్రూవ్ దట్! (సెల్‌ఫోన్‌లో చూపించేడు)

జే.కే. : ఇదెక్కడిది? (గ్రిమ్ ఫేస్‌తో అన్నాడు)

సీఐ : యాక్సిడెంట్ కాగానే ఆ స్పాట్‌లో ఉన్న సీసీ కెమెరాల్లో వున్న పుటేజ్ అంతా మేం కలెక్ట్ చేస్తాం. దాంట్లో మిస్టర్ వేణు నేరం పూర్తిగా రికార్డ్ అయింది. ఇటీజ్ ఏన్ ఓపెన్ అండ్ షట్ కేస్!

జే.కే. : మనం లోపలికెళ్ళి మాట్లాడుకుందాం రండి!

సీఐ : డోంట్ ట్రై ఎనీ గేమ్స్! నాకు లోపలికి రావలసిన అవసరం లేదు. మిస్టర్ వేణుని అరెస్ట్ చేయడానికొచ్చాను. అతన్ని పిలవండి!

(జే.కే.షాకయ్యాడు) (అథారిటీతో) కమాన్.. కాల్ హిమ్!

**లైట్స్ ఆఫ్**

## సీన్ నెం.2 పోలీస్ స్టేషన్

(పోలీస్ స్టేషన్‌లో కావలసిన సరంజామా అంతా వుంది. ఎస్ఐకి ఒకపక్క సీఐకి ఒకపక్క సీట్లున్నాయి. ఎదురుగా లెఫ్ట్ సైడ్ కర్టెన్ కి సెల్ ఉంది. మరోపక్క రికార్డ్ రూం ఉంది. మధ్యలో పొడుగు బల్ల ఉంది. ఎస్ఐ అడుగుతున్నాడు.. శివ చెప్తున్నాడు.. స్టేషన్ రైటర్ రాస్తున్నాడు)

ఎస్.ఐ. : (స్టేట్‌మెంట్ తీసుకుంటున్నాడు) దాంతర్వాత ఏం జరిగింది?

శివ : ఎవరో కారుకింద పడినట్లు అనిపించింది. ఆగి చూసాను, ఏదీ కారుకింద కనిపించలేదు. ఈలోగా జనం పరుగెత్తుకొస్తున్నారు. కొడతారని భయపడి కారుస్టార్ట్ చేసుకొని మా సార్ ఇంటికొచ్చేసాను.

ఎస్ఐ : (రైటర్‌తో) రాసుకో! (శివతో) మీ సార్‌కీ విషయం చెప్పావా?

శివ : (ఎటూ చెప్పలేక) కొత్తకారండి, యాక్సిడెంట్ చేసానంటే ఏవంటారోనని ఆలోచిస్తుంటే మీరొచ్చారండి!

ఎస్ఐ : కారుకింద మనిషి పడినప్పుడు అలా వదిలేసి వెళ్ళిపోతే శిక్ష రెట్టింపవుతుందని తెలీదా?

శివ : తెలీదండి! అలా అవుతుందాండీ? (భయంగా, ఆశ్చర్యంగా)

ఎస్ఐ : అంతేకాదు, కారుకింద పడ్డవాళ్ళు ఖర్మ చాలక చచ్చిపోతే, శిక్ష ఇంకా రెట్టింపవుతుంది.

శివ : అవునాండీ! బెంజ్ కారుకింద పడ్డవాళ్ళకి ఏం ప్రమాదం లేదుగా!

ఎస్ఐ : ఏమో నాకేం తెలుసు? అటు అంబులెన్స్ వెళ్ళింది. అడ్రస్ కనుక్కొని, ఇటు నేనొచ్చా!

శివ : (ఆలోచనలో పడ్డాడు)

ఎస్ఐ : ఇంకా చెప్పాల్సిందేమైనా ఉందా?

శివ : ఇంకేమీ లేదు.

రైటర్ : నిజానికిదంతా నువ్వు రాసివ్వాలి. నీకు సరిగ్గా రాయటం రాదన్నావని, నేను రాస్తున్నాను.

పద్దాలు : (ప్రవేశించింది.. ఎస్ఐతో) నమస్కారం సార్!

ఎస్ఐ : ఏం కావాలి?

శివ : (భార్యను చూసి) రావే!

ఎస్ఐ : నీ భార్యా?

శివ : అవును బాబూ!

పద్దాలు : ఏంటయ్యా ఇది? ఈ కేసులేంటి? గొడవలేంటి? నువ్వలా కండ్లు మూసుకొని ఎట్టా నడిపినావయ్యా?

ఎస్ఐ : ఏంటీ గోలిక్కడ?

పద్దాలు : గోలకాదు బాబు! మాకు ఇద్దరు పిల్లలు. ఈయన రెక్కల కష్టమే కానీ మాకు ఏ ఆధారమూ లేదు. ఇప్పుడీయన ఇలాగా స్టేషన్ చుట్టూ తిరుగుతుంటే మా సంసారం ఎలా నడుస్తుందండి?

ఎస్ఐ : అవన్నీ నన్నడుగుతావేంటి? నీ మొగుణ్ణడుగు! శివా! ఎల్లి మాట్లాడు.

శివ : పెద్దగొడవేం కాదు, కంగారు పడకు! లాయర్లొచ్చే టైమైంది. బెయిల్‌మీద బయటకి తెస్తారు. ఆపైన శిక్ష తక్కువ పడేలా చూస్తారు.

పద్దాలు : ఇదంతా నువ్వు చిటికెలేసినంత సులువుగా జరగదు.

శివ : జరుగుతుంది, సార్ చెప్పారు!

పద్దాలు : (కండ్లలో కండ్లు పెట్టి చూసి) నువ్వసలు యాక్సిడెంట్ చేశావా?

శివ : చేశాను!

పద్దాలు : ఆ మాట ఒట్టేసి ఎప్పు! (చేయి చాపింది)

శివ : (చేయి వెనక్కి తీసుకోబోయాడు)

పద్దాలు : ఆగు, చెయ్యి తియ్యకు, నిజం చెప్పు, నువ్వు చేశావా?

శివ : లేదు! (వెనక్కి తిరిగి చూసి మెల్లగా) నీకెలా తెలుసు?

పద్దాలు : నీచేత తాడు కట్టించుకొని, నీకిద్దరు పిల్లల్ని కన్న ఆడదాన్ని! నీగురించి నాకు తెల్దా! నల్లిని చంపమంటేనే దిక్కులుచూసేవాడివి. నువ్వు యాక్సిడెంట్ చేయడమేంటి? ఇంత నిబ్బరంగా ఉండటమేంటి?

శివ : అదికాదే, అసలు జరిగిందేమిటంటే (రీ రికార్డింగ్ చెవిలో ఏదో చెప్పాడు)

పద్దాలు : ఏంది? నీకేం పిచ్చా.. వెర్రా? అయ్యగారు చెప్పడమేందీ? నువ్వు తలూపడమేంటి?

శివ : ఏయ్! గట్టిగా అరవకే!

పద్దాలు : అరవకేముందయ్యా! ఇంకా రహస్యమేంటి? మన బతుకులే బజార్నపడుతున్నాయ్!

శివ : బజార్నేం పడవే, అన్నీ సారే చూసుకుంటారు. నెలకు ఇరవై వేల జీతం ఇస్తారు. ఏ ఇబ్బందులు లేకుండా చూస్తారు. శిక్ష తక్కువపడేలా చేస్తారు. (చేతిలో డబ్బు కట్ట పెట్టాడు)

పద్దాలు : అయితే ఈ డబ్బుకమ్ముడుపోయావా?

శివ : కాదే, వేణుబాబు చిన్నపిల్లగాడు. ఇందులో ఇరుక్కుంటే సదువు పాడైపోద్ది. ఇన్నాళ్ళు మనల్ని బాగా చూసుకుంటున్న సార్ మాట, కాదనలేకపోయాను.

పద్దాలు : గొడ్డు కసాయివాణ్ణి నమ్మినట్లు మీ సార్‌ని నమ్ముతావేంటయ్యా?

శివ : నోర్మూయ్! అరవకు!

పద్దాలు : నేను మూసుకోను. నువ్వు ఊరిమీద పెంట నెత్తిమీదకెక్కించుకుంటూ నన్ను, నోరు మూసుకోమంటావేంటి? (గొంతు పెంచి అరిచింది)

శివ : చెప్తే వినవేందే? (కొట్టాడు)

పద్దాలు : చెబ్తుంటే నువ్వే ఇంటలే! నీసారు కొడుక్కోసమని, నీ కొడుకుని రోడ్డున పడేస్తున్నావ్! నువ్వింట్లో లేకపోతే నీకొడుకు నామాటింటాడా? ఎవరికైనా లొంగుతాడా? (ఏడుస్తూ)

శివ : నీమాట నీదేగాని, నేను చెప్పేది వినవా? నేను చిటికెలో వస్తా! నువ్వు వెళ్ళు...అంతా సార్ చూసుకుంటారు. మాట తప్పరు!

పద్దాలు : నువ్వు స్టేషన్‌కొచ్చి ఎంతసేపయింది?

శివ : గంట దాటింది? (భయం, అనుమానంగా)

పద్దాలు : గంటదాటింది కదా! లాయర్లేరి? నీ వెనకాలే వస్తారని, సార్ మాట తప్పరని, హరికథలు చెప్తున్నావుగా ఏరీ?

శివ : (అయోమయంగా చూసాడు)

పద్దాలు : ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. నిజం చెప్పెయ్!

రైటర్ : ఏమయ్యా! మీ గోల ఇంకా అవ్వదా? సరె, ఇలారా.. సంతకం పెట్టు!

శివ : (దగ్గరికొస్తే ఎస్ఐ పెన్ ఇచ్చాడు)

శివ : ఏంటండిది?

రైటర్ : నీ స్టేట్‌మెంట్! ఇందాకట్నుంచి రాస్తున్నాంగా.. సంతకం పెట్టు!

శివ : ఇలాంటి కేసుల్లో శిక్ష ఎంతకాలం పడుతుందండి?

ఎస్ఐ : జడ్జిగారి మూడ్‌ని బట్టి ఉంటుంది. చెప్పానుగా! ఆ కారుకింద పడ్డ మనిషి పైకెళ్ళిపోతే శిక్ష కూడా పెరిగిపోతుంది. త్వరగా సంతకం పెట్టు!

శివ : (పెన్ను బల్లమీద పెట్టి) నేనీ నేరం చెయ్యలేదు సార్! బెంజ్ కారు నేనెప్పుడూ నడపలేదు సార్! నేను జే.కే.గారి డ్రైవర్ని. నేను ఆయన BMW కారునే నడుపుతా!

రైటర్ : ఏంటి ప్లేటు మార్చావ్?

శివ : ఇది నిజమండి, ఇందాక చెప్పింది అబద్ధం!

ఎస్ఐ : నువ్వు చెప్పేవన్నీ వినడానికి పోలీసులు చెవిలో పూలెట్టుకున్నారనుకుంటున్నావా? మక్కెలిరిగిపోతాయ్! సంతకం పెట్టు!

(బయట జీప్ ఆగిన శబ్ధం. సీఐ ప్రవేశం)

ఎస్ఐ : నమస్తే సార్!

సీఐ : ఏంటీగోల? (కూర్చుంటూ) బయటికే వినబడుతుంది!

ఎస్ఐ : డ్రైవర్ మాట మారుస్తున్నాడు! ముందు నేరాన్ని ఒప్పుకున్నాడు. ఇప్పుడు తను చేయలేదంటున్నాడు.

సీఐ : ఏమయ్యా, ఎందుకలా మాటమారుస్తున్నావ్?

పద్దాలు : సార్! నేను చెప్తా సార్!

సీఐ : నువ్వెవరూ?

ఎస్ఐ : అతని భార్యసార్!

సీఐ : ఊఁ చెప్పు!

పద్దాలు : జే.కే.గారి అబ్బాయి యాక్సిడెంట్ చేశాడు. జే.కే.గారు డబ్బాశ చూపించి నా భర్తని ఈ కేసుని నెత్తిమీద వేసుకోమన్నారు. నేనొచ్చి పిల్లలకన్యాయం చెయ్యొద్దని గోల పెడితే జరిగిన నిజం చెప్పడానికి నా భర్త ఒప్పుకున్నాడండి. పోలీసులు మాత్రం ఒప్పుకోవటం లేదు.

సీఐ : ఏమయ్యా! నీ పెళ్లాం చెప్పేది నిజమేనా?

శివ : నిజమేనండి! చినబాబే యాక్సిడెంట్ చేసింది.

సీఐ : మరెందుకు నీమీద వేసుకున్నావ్? డబ్బుకోసమేనా?

శివ : కాదుసార్! ముక్కుపచ్చలారని పిల్లాడు కేసుల్లో ఇరుక్కుంటే చదువు దెబ్బతింటుందని నామీదేసుకున్నానుసార్!

సీఐ : ఉన్నవాళ్ళ పిల్లలమీద జాలేంటయ్యా! వాళ్ళకీ కారు నడిపేటప్పుడు డబ్బు మదంతో కండ్లు మూసుకుపోయుంటాయి. ఆపైన తాగారో చెప్పక్కర్లేదు. ఇద్దరు ముగ్గుర్ని చంపనైనా చంపుతారు లేదా వాళ్ళైనా చస్తారు. నిన్నకాక మొన్న సెంట్రల్ మినిష్టర్ కొడుకు చావలేదా? వాడిది 220 స్పీడు, వీడిది 200 అంతే తేడా?

పద్దాలు : బాబుగారు చెప్పేమాట సత్యం!

సీఐ : నిన్ను జైలుకు తోసి తప్పించుకోవాలని చూసేవాళ్ళని బొక్కలోవేసి, బొమికలు విరగ్గొట్టాలి.

శివ : ఆ కుర్రాడు మంచాడే సార్!

సీఐ : మంచోడు కాబట్టే 200 స్పీడులో కారు నడిపాడు, ఓ నిండుప్రాణం తీసాడు. అవునా?

శివ : ఆ... ప్రాణం పోయిందా సార్?

సీఐ : రెండువందల స్పీడ్‌లో గుద్ది, ఆ మనిషిని అరమైలు లాక్కెళ్తే ఇంకా బతికుంటుందా?

సీఐ : సరే, నువ్వు స్టేట్‌మెంట్ రాసివ్వు! ఈ కేసులో మీసార్ లాంటి వాళ్ళకి ఓ పాఠం నేర్పుతాను. (ఎస్ఐతో) అతనికి ఓ కాగితం, పెన్ను ఇవ్వు!

ఎస్ఐ : (ఇచ్చాడు)

శివ : నేను సరిగా రాయలేను సార్!

సీఐ : సరే, ఆ కాగితం మీద కింద సంతకం పెట్టు. మా రైటర్ రాస్తాడు.

శివ : అలాగే సార్! (కాగితంపై సంతకం చేస్తాడు)

సీఐ : 403.. ఆకాగితం తీసుకో! (403 తీసుకున్నాడు) ఇంతకు ముందు అతను చేసిన నేరం ఒప్పుకుంటూ, అతను చెప్పిన స్టేట్‌మెంట్ అంతా ఉన్నదున్నట్లు ఈ కాగితం మీద రాయి!

శివ : అదేంటి సార్! ఈ నేరం నేను చేయలేదని చెప్తున్నాగా!

సీఐ : నువ్వు చెప్పేది నువ్వు చెప్పావ్! పోలీసులకు కావాలసింది పోలీసులు రాసుకుంటారు.

పద్దాలు : సార్! ఇది అన్యాయం సార్! మంచిగా మాట్లాడి సంతకం తీసుకుని మాట మారుస్తున్నారేంటి సార్!

సీఐ : నువ్వు నోర్ముయ్యవే, పోలీస్ స్టేషన్లో నీ వాగుడేంటి? 403.. దాన్ని బయటికి నెట్టెయ్!

పద్దాలు : ఇది అన్యాయం సార్! పెద్దవారు, మీరిట్లా చెయ్యటం అన్యాయం సార్!

సీఐ : ఏయ్! 403 దాన్ని బయటకు ఈడ్చెయ్యావోయ్! (403 లాక్కెళ్తున్నాడు)

శివ : సార్! దాన్నేం చెయ్యొద్దుసార్! (విడిపించబోతాడు)

సీఐ : నువ్వెక్కడికిరా వెళ్ళేది? ప్రతాప్ వాణ్ణి సెల్లో వేసెయ్!

(పద్దాల్ని 403 లాక్కెళ్తున్నాడు.. ఆమె ఏదో గొణుగుతూనే ఉంది. ఆమెవైపు వెళ్తున్న శివని ఎస్ఐ ప్రతాప్ పట్టుకొన్నాడు)

సీఐ : (శివ దగ్గరకొచ్చి కాలర్ పట్టుకుని) ఏరా! జేకే గారి దగ్గర డబ్బు తీసుకొని ఇక్కడికొచ్చి మాట మారుస్తావా? ఎంత దొబ్బావ్ ఆయనదగ్గర?

శివ : నువ్వెంత దొబ్బావ్‌రా?

సీఐ : (లాఠీతో బాదుతుండగా)

403 : సార్ చచ్చిపోతాడేమో సార్!

సీఐ : బారెడు తాడు లేదా స్టేషన్‌లో. పైన ఫ్యాన్‌కి కట్టి, వీణ్ణి వేలాడదియ్. ఉరి వేసుకున్నాడని కేసు క్లోజ్ అయిపోతుంది! పీడ వదిలిపోతుంది!

**లైట్స్ ఆఫ్**

## సీన్ నెం.3

(జే.కే. ఇల్లు. సీడీ లో విష్ణు సహస్రనామం వస్తుంది. ప్రభ వింటూ మాల తిప్పుతూ ఆర్ఎఫ్ నుండి ఎల్ ఎఫ్ కేసి వెళ్తుంది. జే.కే. మెట్లు దిగి వచ్చాడు. సోఫాలో కూర్చున్నాడు. లాప్‌టాప్ ఓపెన్ చేశాడు. సెల్‌ఫోన్ మోగింది. అది ఎత్తి)

జే.కే. : (హలో అంటూ మాట్లాడ్డానికి ప్రయత్నించాడు. వినపడలేదు. సీడి ఆఫ్ చేసాడు) హలో.. నువ్వా వనజా! ఏంటీ? ఈవేళప్పుడు గుర్తొచ్చాను? ఏం మీ ఆయన ఇంట్లో లేడా? సంపాదన ఫుల్! సంసారం నిల్! మీ ఆయనకి లైఫ్‌లో లాభం, వైఫ్ వల్ల నష్టం. (నవ్వాడు) నిన్నరాత్రి ఇంట్లోనే వున్నాను.

ప్రభ : (గ్లాస్ తో వచ్చి) క్రిష్ణ.. క్రిష్ణ దేవుడి స్తోత్రం ఎందుకు ఆఫ్‌చేశారు?

జే.కే. : (ఆమెను షార్ప్‌గా చూసి) ఫోనొచ్చింది!

ప్రభ : క్రిష్ణ..క్రిష్ణ.. మీఫోన్లు, ఫోన్లో మీ ముచ్చట్లు–మురిపాలు గదిలో పెట్టుకోండి. ఇక్కడకాదు!

జే.కే. : నీకు దైవ భక్తి ఉంది గానీ, పతి భక్తి లేదు!

ప్రభ : సర్లెండి! తీసుకోండి! (గ్లాసుతో పాయసం ఇవ్వబోయింది)

జే.కే. : ఏంటీ విశేషం? పాయసం చేశావ్?

ప్రభ : బాబుకి క్రిష్ణపరమాత్మ దయవల్ల ఢిల్లీలో సీటొచ్చిందికదా! వాడికి ఇష్టమని చేసాను. (ఇంతలో సెల్ ఫోన్ మోగింది. అది ఓ లేడీ నెంబరు)

జే.కే. : (ఫోన్ చూసి) వాడికిష్టం కదా! వాడికే పెట్టు! (ఫోన్‌తో వెళ్తూ)

ప్రభ : (గ్లాసు బల్లమీద పెట్టి) వేణూ.. వేణూ.. (అని పిలిచింది)

వేణు : ఏంటమ్మా! (అంటూ వచ్చాడు)

ప్రభ : నీకిష్టమని సేమ్యా పాయసం చేశాను. వేడిగా ఉంది తీసుకో! (అంటూ వెళ్ళింది)

వేణు : (తినడానికి వేడిని ఊదుతున్నాడు)

అంజలి : (వాయిస్) అన్నయ్యా... పాయసం బాగుందా?

వేణు : (చంచాతో తినబోతూ ఆ వాయిస్ విని ఎవరా అన్నట్లు చూసాడు. ఎవరూ కనబడలేదు.) మళ్లీ తినడానికి చెంచాతో తీసుకొని ఊదుకొని తినబోయాడు)

అంజలి : (వాయిస్) ఏం అన్నయ్యా! రుచిగా వుందా?

వేణు : (సీట్‌లోనుండి లేచి, అటూ ఇటూ నడుస్తూ చూసి) ఎవరూ కనబడరేం? (అని వచ్చి మళ్ళీ సీట్లో కూర్చోబోతుండగా)

అంజలి : (పక్కనుంచి వచ్చింది) ఎవరికోసం వెతుకుతున్నావ్?

వేణు : (ఆశ్చర్యంగా అంజలిని చూసి) నీకోసమే... మాట వినబడుతుంది... మనిషి కనబడలేదు... ఇంతకీ ఎవరు నువ్వు?

అంజలి : నేను అంజలిని!

అంజలి : పాయసం చల్లారిపోతుంది,తిను! నీకు చాలా ఇష్టం కదా!

వేణు : నాకిష్టమని నీకెలా తెలుసు? (తీసుకున్నాడు)

అంజలి : (పెదాలు తడుపుకుంటూ) బాగుందా?

వేణు : బాగుంది! అమ్మ బాగా చేస్తుంది.

అంజలి : మా అమ్మకూడా బాగా చేస్తుంది. నీ పుట్టినరోజునాడు సేమ్యా పాయసం చేస్తాను, వెళ్ళి జీడిపప్పు తేవే అంజలీ అంటూ నన్ను షాపుకి పంపింది. జీడిపప్పు కొనివస్తుంటేనే నువ్వెదురొచ్చావ్!

వేణు : నేనా!

అంజలి : అవును, బెంజ్‌కార్‌లో వచ్చావ్! చాలా స్పీడ్‌గా వచ్చావ్. ఒక్క క్షణం కనపడ్డావ్. తర్వాత ఏమీ కనపడలేదు. నన్ను చాలా దూరం కారుకింద లాక్కుంటూ వెళ్ళిపోయావ్!

వేణు : నేనా! ... నిన్నా!

అంజలి : అవునన్నయ్యా! ఆదివారం సాయంత్రం!

వేణు : ఆదివారం సాయంత్రమా! ఆరోజు నాకారు యాక్సిడెంట్ అయింది. కారుకింద ఎవరో పడ్డారు.

అంజలి : అది నేనే!

వేణు : కారుకింద పడి, అంతదూరం కారు ఈడ్చుకుపోతే నీకేం దెబ్బలు తగల్లేదా?

అంజలి : ఏమో నాకేం తెలుసు? కారు తాకగానే ప్రాణం పోయిందిగా!

వేణు : అంటే నువ్వు చచ్చిపోయావా?

అంజలి : అదే కదా నేను చెప్పేది!

వేణు : (భయంగా) అంటే నువ్వు... నువ్వు...

అంజలి : దెయ్యం అంటావో... ఆత్మంటావో.. ప్రేతాత్మంటావో.. నీయిష్టం! నీకెలా కావాలంటే అలా పిలుచుకో!

వేణు : ఏయ్... జోక్ చేస్తున్నావు కదా!

అంజలి : లేదన్నయ్యా! నిజం చెబుతున్నాను. నేను నీకారుకింద పడ్డ అంజలినే!

వేణు : ఇటీజ్ ఇంపాజిబుల్! నేన్నమ్మను!

అంజలి : నువ్వు నమ్మాలంటే నేనేం చెయ్యాలి? ఓ పనిచెయ్! పాయసం గ్లాస్ బల్లమీద పెట్టు.

వేణు : (బల్లమీద పెట్టాడు. గ్లాస్ గాల్లో లేచింది, తిరిగి కిందికి వచ్చింది.)

అంజలి : ఇప్పుడు నమ్ముతావా?

వేణు : (కంగారు పడ్డాడు) మైగాడ్!

అంజలి : మైగాడ్ అంటావేంటి? నేనేం దేవుణ్ణికాదు, దెయ్యాన్ని (నవ్వుతూ అంటుంది)

ప్రభ : (వస్తూ) క్రిష్ణ.. క్రిష్ణ.. పాయసం ఇంకా తిన్లేదేంరా! (గ్లాస్ తీసి చూసింది)

అంజలి : మీ అమ్మగారా?

వేణు : అవును, మా అమ్మే!

ప్రభ : క్రిష్ణ.. ఎవరితో మాట్లాడుతున్నావ్ నాన్నా!

వేణు : అంజలితోనమ్మా!

ప్రభ : (చుట్టూ చూసి) అంజలి ఎవర్రా? ఎక్కడా?

వేణు : ఇక్కడుందిగా! కనబడటం లేదా?

అంజలి : కనబడను, నీకు తప్పించి మరెవరికీ కనపడను, వినపడను.

ప్రభ : ఇక్కడెవరున్నారురా? నాకు కనబడటం లేదు, నేనేమైనా కండ్లజోడు మార్చుకోవాలేంట్రా?

వేణు : అక్కరలేదు!

ప్రభ : క్రిష్ణ...క్రిష్ణ.. ఇంతకీ ఉన్నట్టా, లేనట్టా?

వేణు : వుందంటే ఉంది, లేదంటే లేదు!

ప్రభ : ఏంటో... నువ్వు మీ నాన్నలాగే తయారవుతున్నావ్. చెప్పేదానికి, చేసేదానికి పొంతనుండటం లేదు. (అంటూ వెళ్ళిపోయింది)

వేణు : (లేచి వెళ్ళబోతాడు)

అంజలి : ఎక్కడికి?

వేణు : నాగదిలోకి!

అంజలి : పద! నేనూ వస్తాను!

వేణు : నా వెనక ఎందుకు పడుతున్నావ్?

అంజలి : నువ్వే నావెనక పడ్డావ్! నాదారిన నేను రోడ్డుమీద వెళ్తుంటే నువ్వు బెంజ్‌కారుకి తగిలించుకుని నన్ను నీతో ఈడ్చుకెళ్లావ్!

వేణు : ఆ బెంజ్ కారు నాదే కానీ, ఆదివారం దాన్ని నేను నడపలేదు. మా డ్రైవర్ యాక్సిడెంట్ చేశాడు. నేరం ఒప్పుకొని పోలీసులకు లొంగిపోయాడు.

అంజలి : కథలు బాగా చెబుతున్నావన్నయ్యా!

వేణు : కథలేంటి? జరిగింది! అదే! (కోపంగా)

అంజలి : అదేనా! మరి నువ్వెందుకు పరుగెత్తుకుంటూ మీనాన్నదగ్గరికొచ్చావ్! మీనాన్నెందుకు డ్రైవరికి డబ్బులిచ్చేడు? డ్రైవర్ యాక్సిడెంట్ చేసినట్లు ఎందుకు ఒప్పించాడు? నువ్వెందుకు, అంత అర్జంటుగా ఢిల్లీ పారిపోయావ్?

వేణు : నేనెక్కడికీ పారిపోలేదు. నా కాలేజ్ సీటుకోసం ఢిల్లీ వెళ్లాను!

అంజలి : అబద్ధం. కారుతో నన్ను తొక్కేసి, ఢిల్లీ పారిపోయావ్, మీ డాడీ అందర్నీ కొనేసి, డ్రైవర్ని జైలుకు పంపేడు. ఔనా?

వేణు : (కోపంగా) కాదు. అని నేను చెప్తుంటే.. మళ్లా అదే ప్రశ్న అడుగుతావేంటి? ఏక్సిడెంట్ చేసింది నేను కాదు. నన్నొదిలిపో. వెళ్లి ఆ డ్రైవర్ని పట్టుకో – వెళ్లు ...పో.

అంజలి : వెళ్ళను. నన్ను కారుతో గుద్దిన వాళ్లని వదలి నేను – వెళ్లను..నీతోనే ఉంటా–

వేణు : (చిరాగ్గా) నిన్ను వదిలి నేను వెళ్లిపోతాను.

అంజలి : (చెయ్యి మంత్రించి) వెళ్లలేవు.

వేణు : ఎందుకు వెళ్లలేను? (లేచేడు – ఎలా లేచేడో అలానే కూలబడ్డాడు)

అంజలి : (పకపక నవ్వింది)

వేణు : ఇదేమిటి? (అంటూ మళ్లీ లేచాడు – ఎలా లేచేడో అలానే కూలబడ్డాడు)

అంజలి : వెళ్లలేవు. నేను వెళ్లనివ్వటంలేదు.

వేణు : (భయంగా,) ఎందుకు నన్నిలా వేదిస్తున్నావ్?

అంజలి : నేను వేదించదలిస్తే – నిన్ను చిత్రహింసలు పెట్టగలను. కానీ నాకిష్టం లేదు.

వేణు : మరెందుకు నా వెంట పడ్డావ్?

అంజలి : నువ్వు అబద్ధం చెప్తున్నావు గనుక

వేణు : లేదు. నేను చెప్పేది నిజం. నా మాట విని నువ్విక్కడ్నించి వెళ్లిపో – నీ విషయం మా డేడీకి తెలిస్తే నీకే ప్రమాదం.

అంజలి : (నవ్వి) ఏం చేస్తాడు? మీ డేడి

వేణు : మా డేడి తల్చుకుంటే నిన్ను ఏదైనా చెయ్యగలరు.

అంజలి : చెయ్యనీ, చేసినప్పుడే వెళ్తాను.

వేణు : నువ్వు మొండి దెయ్యంలా ఉన్నావ్.

అంజలి : దెయ్యాన్నేగా. అందుకే నిన్ను పట్టుకున్నాను.

జే.కే. : వేణూ.. ఎవరితో మాట్లాడుతున్నావ్?

వేణు : అంజలితో డాడీ!

జే.కే. : అంజలి ఎవరు?

వేణు : నా కారుకింద, (సర్దుకుని) అదే మన బెంజ్ కారుకింద పడ్డ అమ్మాయి!

జే.కే. : ఆ అమ్మాయి ఆరోజే చచ్చిందికదరా!

వేణు : ఏం చచ్చిందో ఏంటో? ఇప్పుడు నన్ను చంపుతుంది!

జే.కే. : ఏది? ఎక్కడుంది?

అంజలి : నీ పక్కనే!

జే.కే. : (వెంటనే అడుగులు దూరం వేసాడు) ఇలారా.. నిజంగా అక్కడుందా?

వేణు : వుంది డాడీ! సోఫాలో కూర్చుంది.

జే.కే. : (సోఫాకేసి చూస్తుండగా ఫోన్ మోగింది) హలో.. ఆఁ.. నేనే!

వేణు : ఎవరు డాడీ! ఢిల్లీ అంకులా?

జే.కే. : కాదురా! శ్రీరాం!

అంజలి : కాదు, శ్రీలక్ష్మి!

వేణు : కాదు, శ్రీలక్ష్మి!

జే.కే. : (షాక్ తిని) ఏం మాట్లాడుతున్నావ్? లైన్‌లో ఉన్నది శ్రీరామే!

అంజలి : కాదు, శ్రీలక్ష్మే! ఇందాక ఫోన్ చేసిన సుధాకి ఈవిడ అక్కగారే!

వేణు : కాదు, శ్రీలక్ష్మే! ఇందాక ఫోన్ చేసిన సుధాకి ఈవిడ అక్కగారే!

జే.కే. : (భయపడి, ఫోన్‌లో) తర్వాత మాట్లాడతా!

అంజలి : మాట్లాడాల్సింది.. మొన్న కొనిచ్చిన డైమండ్ నెక్లెస్‌కి థాంక్స్ చెప్పేది.

వేణు : మాట్లాడాల్సింది.. మొన్న కొనిచ్చిన డైమండ్ నెక్లెస్‌కి థాంక్స్ చెప్పేది.

జే.కే. : ఇవన్నీ నీకెవరు చెబుతున్నార్రా?

వేణు : అంజలి!

జే.కే. : మైగాడ్! నువ్విలారా! (చేయిపట్టుకొని లోనికి తీసుకెళ్ళబోతే తిరిగి కూలబడ్డాడు)

అంజలి : (మంత్రం వదిలే సైగచేసింది వాళ్లు కదలకుండా)
(వాళ్ళెలా వెళ్తే అలావెళ్తుంది. జే.కే. రెండు మూడు రూట్లు మారుస్తాడు.. అంజలీ అదే రూట్ ఫాలో అవుతుంది)

వేణు : నా వెనుకే వస్తుంది డాడీ!

జే.కే. : అయితే నా వెనకాలే నువ్ రా! (అని లోనికెళ్ళారు)
(అంజలికూడా లోనికెళ్తుంది)

జే.కే. : (మాత్రం తిరిగొచ్చాడు)

ప్రభ : వేణు ఏడి?

జే.కే. : గదిలో ఉన్నాడు! వాడేదో పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నాడు ప్రభా! వాడెదురుగా ఎవరో పాప ఉందంటున్నాడు. నాకేం కనపడలేదు.

ప్రభ : నాతోటీ అన్నాడు, నాకూ కనబడలేదు!

జే.కే. : ఏదో దెయ్యం పట్టినట్టు మాట్లాడుతున్నాడు!

ప్రభ : క్రిష్ణ.. క్రిష్ణ.. ఎక్కడో జడుసుకుని ఉంటాడు!

జే.కే. : ఉండు, పాస్టర్ ఏసుపాదానికి ఫోన్ చేస్తాను. ఆయనొస్తే హోలీ వాటర్ తెస్తాడు. దాంతో గాలీ, ధూళీ, దెయ్యం, భూతం అన్నీ ఎగిరిపోతాయి! (సెల్ తీశాడు)

ప్రభ : క్రిష్ణ..క్రిష్ణ.. క్రిస్టియన్ పాస్టర్ ఎందుకు? నేను గట్టిగా దిష్టి తీస్తాను. అన్ని ఎగిరిపోతాయ్!

జే.కే. : కాదే, చిన్నపామునైనా పెద్దకర్రతో కొట్టాలి. ఫాస్టర్‌ని పిలిపిస్తాను. ఆయన చాలా పవర్‌ఫుల్!

ప్రభ : ఏమక్కర్లేదు, నేను దిష్టి తీస్తాను. (లోనికెళ్ళింది)

జే.కే. : (తలకొట్టుకొని, ఫోన్ తీసి) హలో ఏసుపాదంగారూ! నేను జే.కే.ని. (ఇంతలో వేణు, అతని వెనకాల అంజలీ ఒకేరకంగా నడుస్తూ రావడం చూసి, ఫోన్‌లో మాట్లాడుతూనే ఎల్.ఎఫ్ లోకి వెళ్ళాడు)

వేణు : నా వెనకాలే ఎందుకొస్తున్నావ్?

అంజలి : నీచేత హ్యాపీ బర్త్‌డే అని చెప్పించుకోడానికి!

వేణు : ఈరోజు నీ పుట్టినరోజా?

అంజలి : మొన్న కారుకింద పడి చచ్చిపోకపోతే, ఈరోజే నాహ్యాపీబర్త్‌డే! విచిత్రమేమిటంటే? నీ బర్త్‌డే నా డెత్‌డే అయింది.

వేణు : ఎన్నిసార్లు చెప్పాలి? ఆరోజు కారు నడిపింది నేను కాదు, కాదు.. కాదు.

అంజలి : నువ్వే నడిపావ్... అవును.. అవును.. అవును!

ప్రభ : (వచ్చి) క్రిష్ణ.. క్రిష్ణ.. నీలో నువ్వే మాట్లాడుకుంటున్నావ్?

వేణు : లేదమ్మా! అంజలితో మాట్లాడుతున్నాను!

ప్రభ : (తలకొట్టుకొని) సరె..సరె, ఇలా కదలకుండా కూర్చో, దిష్టి తీస్తాను! ఇరుగు దిష్టి, పొరుగు దిష్టి, ఊళ్లోవాళ్ళ దిష్టి, విమానం దిష్టి, కొత్తకారు దిష్టి, నాదిష్టి, అన్ని దిష్టిలు పోవాలి! ఇలా ఉమ్మి వెయ్!

అంజలి : (వేణుకి బొట్టు పెట్టినదగ్గర్నుండి, బ్యాంగ్ మ్యూజిక్‌లో అంజలి ఒక్కొక్కమాటకి ఒక్కొక్క అడుగు వెనక్కు జంప్ చేస్తూ సైడ్‌వింగ్‌లోకి వెళ్తుంది)

ప్రభ : (ఉమ్మి వేసిన తర్వాత పళ్లెం అక్కడ పెట్టి) కాళ్ళూ, చేతులూ కడుక్కొని వస్తా! (అని లోనికెళ్ళింది)

వేణు : (తల్లి వెళ్లాక చుట్టూ చూశాడు. అంజలి కనిపించలేదు. రిలీఫ్ అయ్యాడు)

అంజలి : (ఎలా వెనక్కు గెంతుకుంటూ వెళ్ళిందో అలాగే ముందుకి గెంతుకుంటూ వచ్చింది)

వేణు : (ఆశ్చర్యంగా చూసి) అదేమిటి? దిష్టి తీస్తే వెళ్లిపోయి మళ్ళీ వచ్చావేంటి?

అంజలి : నేనెక్కడికీ వెళ్ళలా! మీ అమ్మగారి నమ్మకాన్ని గౌరవించా అంతే! ఏయ్! (అని ప్లేటు తీసుకుని పారాణి కలుపుకొని) నాకు పారాణి అంటే చాలా ఇష్టం. నా ప్రతి పుట్టినరోజుకి నా కాళ్ళకి పారాణి రాసేది మా అమ్మ. ఇవ్వాల నా పుట్టినరోజు కదా! నా పాదాలకి కొంచెం రాయవా!

వేణు : నాకు రాయడం రాదు!

అంజలి : (చూపిస్తూ) ఇలా రాయాలి! ప్లీజ్ రాయి అన్నయ్యా ప్లీజ్ మా అన్నయ్య రాస్తాడు – రాస్తాడు.

వేణు : ట్రై చేస్తా! (అని రాస్తున్నాడు)

ప్రభ : (వచ్చి, ఆశ్చర్యంగా చూస్తూ) ఏంట్రా పిచ్చి? సోఫాకి పారాణి పెడుతున్నావ్?

వేణు : (తలెత్తకుండా పారాణి రాస్తూనే) సోఫాకి కాదు, అంజలికి రాస్తున్నా!

ప్రభ : క్రిష్ణ... క్రిష్ణా! నేను దిష్టి తీసినా ఆ అంజలి నిన్ను వదల్లేదా?

వేణు : (పట్టించుకోకుండా రాస్తూనే ఉన్నాడు)

జే.కే. : (బయటినుండి వచ్చాడు, గమనించి) మొండి దెయ్యం! అందుకే ఏసుపాదానికి ఫోన్ చేసాను. ఆయనొస్తున్నాడు.

ప్రభ : మొండి దెయ్యం అయతే భూతాల బంగార్రాజుని పిలిపిస్తాను! అతను అడుగు పెట్టగానే దెబ్బకు పారిపోతుంది!

అంజలి : (ఆ యిద్దరు అన్న మాటలకి ఆర్ ఆర్ లో తలతిప్పి, కండ్లు పెద్దవి చేసింది)

ఏసుపాదం : (వచ్చాడు)

జే.కే. : రండి ఫాస్టర్.. రండి!

ఏసుపాదం : మే గాడ్ బ్లెస్ యువర్ ఫ్యామిలీ!

జే.కే. : మై వైఫ్ ప్రభ!

ప్రభ : (పెద్ద రెస్పాన్స్ లేకుండా) నమస్కారం! (అని లోనికెళ్ళింది)

ఏసుపాదం : సాతాను ఆవహించిన బాలుడేడి?

జే.కే. : అతనే వేణు! మై ఓన్లీ సన్!

ఏసుపాదం : బిడ్డా! సాతానును నీవు చూడగల్గుతున్నావా?

వేణు : సాతానా? ఎవరూ?

ఏసుపాదం : నిన్నావహించిన దుష్టశక్తి!

వేణు : అంత పెద్ద శక్తేం కాదు, చిన్నపిల్ల!

ఏసుపాదం : సరే, పరలోకమందున్న ఓ ప్రభువా! ఈ నీబిడ్డకు దుష్ట సాతాను నుండి విముక్తి కలిగించు, స్వస్థత ప్రసాదించు! ఈ కుటుంబ సభ్యులకు ఊరట కలిగించు! ఆమెన్! (శిలువ నెత్తిన పెట్టి, శిలువ గుర్తు వేసి, నీళ్లు చల్లాడు) ఆ సాతాను ఇంకా నీకు కనిపించుచున్నదా?

వేణు : అదిగో! ఆ సోఫాలో ఉంది!

ఏసుపాదం : (సోఫా వద్దకెళ్ళి హెూలీ వాటర్ చల్లబోతూ ప్రార్ధనచేయబోగా, అంజలి పక్కకు వెళ్ళి బల్లమీద కూర్చుంది. ఇంకా ఆమె అక్కడే ఉందన్న భ్రమలో మంత్రాలు చదవడం మొదలు పెట్టాడు)

మంత్రం : సర్వశక్తిమంతుడైన ఓ ప్రభువా! నీశక్తితో, నీ మహిమతో ఈ దుష్ట సాతానుని పారద్రోలుము. నీ పాదముల క్రింద పడవేసి దాన్ని త్రొక్కి, త్రొక్కి మరల ఈ గృహము వైపు రాకుండా చేయుము! ఈ పవిత్ర జలశక్తితో సాతానుని ఆశక్తురాలిని చెయ్యుము! ఆమెన్!

ఏసుపాదం : జే.కే. ఈ పవిత్ర జలాన్ని గృహమంతటా చల్లించు! ఈరోజునుండి నీ సంపాదనలో దశమభాగం చర్చి పాస్టర్‌నైన నాకిచ్చి ప్రభువు దీవెనలు పొందు. నీవు ఇచ్చినదానికి పదిరెట్లు ప్రభువు నీకొసగును. ప్రతిదినం చర్చిలో మీ పేరిట ప్రార్ధనలు జరిపించెదను!

జే.కే. : అలాగే పాస్టర్!

ఏసుపాదం : డబ్బు శీఘ్రముగా పంపునాయనా! ప్రభువుకు చేసిన వాగ్దానానికి కాలయాపన పనికిరాదు. (వెళ్తాడు) (జే.కే. సాగనంపడానికి వెళ్ళాడు)

అంజలి : (వచ్చి, పాస్టర్‌ని అనుకరిస్తూ) పరలోకమందున్న ప్రభువా! పాస్టర్ బిడ్డకు తాను కోరిన ధనము శీఘ్రముగా చేరుగాక! ఆమెన్!

వేణు : అదేమిటి అలా వేళాకోళం చేస్తున్నావ్! నిన్ను తరిమికొట్టడానికే ఫాస్టర్ వచ్చాడు!

అంజలి : మీ ఫాదరేమో తన రహస్యాలు బయటపడిపోతాయని పిలిపించాడు, ఆ ఫాదరేమో తన విరాళం కోసం తను వచ్చాడు. ఎవరేం చేసినా నిన్ను నేను ఒదిలిపెట్టను!

వేణు : అయితే, నన్నొదిలిపెట్టవా? (మెల్లిగా అడిగాడు)

అంజలి : వదలను అన్నయ్య, నా శక్తి మీద ఇంకా నీకు నమ్మకం రాలేదా?

వేణు : నీ శక్తి మీద నాకు నమ్మకం వచ్చింది అలాగే నన్నేం చెయ్యవనే ధైర్యం కూడా వచ్చింది.

అంజలి : థాంక్స్.

వేణు : నువ్వింత మంచిదానివి కదా నన్ను ఒదిలిపోవచ్చుగా

అంజలి : నేను మంచిదాన్నే. కానీ, నువ్వు చేసినది మంచి పనికాదు. నువ్వు మంచివాడివి కాదు.

వేణు : మంచివాడ్నికానా?

అంజలి : కావు. నువ్వు అబద్దాల మీద అబద్దాలు ఆడతావ్. అందుకే నిన్ను ఒదలటంలేదు.

వేణు : నేను నిజమే చెప్తున్నాను నువ్వు నమ్మటం లేదు – పోనీ ఏమిస్తే నన్ను ఒదిలిపోతావో చెప్పు. డబ్బు – బంగారం – ఏంకావాలి?

అంజలి : నేను దెయ్యాన్ని. నేను డబ్బు, బంగారం ఏంచేసుకోను? మీ డేడి డ్రైవర్ని కొంటే – నువ్వు దెయ్యాన్ని కొంటాననంటున్నావ్.

ప్రభ : (వచ్చి) క్రిష్ణ.. క్రిష్ణ.. ఎవరితో మాట్లాడుతున్నావు?

వేణు : ఇంకెవరు? అంజలితోనే!

ప్రభ : క్రిష్ణ..క్రిష్ణా! ఇంకా ఇక్కడే ఉందన్నమాట! నాకు ముందే తెలుసు, ఈ కిరస్తాని మంత్రాలు పనిచేయవని!

జే.కే. : (వచ్చి) ఈ హెూలీ వాటర్ ఇల్లంతా చల్లించు! నాకర్జంటు పనుంది!

ప్రభ : నా నెత్తిన పోయండి!

జే.కే. : అదేంటే?

ప్రభ : అంజలి మళ్ళీ వచ్చింది!

జే.కే. : (వస్తూ) ఇంపాజిబుల్! పారిపోయి ఉంటుంది. ఇంకా పోకపోతే నువ్వు ఈ పవిత్ర జలాన్ని ఇల్లంతా చల్లించు! గ్యారంటీగా పారిపోతుంది. నేను వెళ్ళాలి!

అంజలి : అవును, అర్జంటుగా శ్రీలక్ష్మి ఇంటికి వెళ్ళాలి!

వేణు : ఏం డాడీ! శ్రీలక్ష్మి ఆంటీ ఇంటికి వెళ్ళాలా?

జే.కే. : అంజలీ ఇక్కడే ఉందే! ఇక్కడే ఉంది. (కూర్చుండిపోయాడు)

ప్రభ : అదే నే చెప్పేది! నే చెప్పినట్లు భూతవైద్యుడు బంగార్రాజును పిలిపిస్తాను. ఆయన ఇలాంటి దెయ్యాలతో బంతులాడతాడు.

**లైట్స్ ఆఫ్**

## సీన్ నెం.4

(అంజలి, వేణు ఫైర్ ప్లేస్ ముందు కూర్చుని ఉన్నారు. వేణు చలికాచుకుంటున్నాడు. అంజలి మామూలుగా ఉంది)

వేణు : (అంజలిని చూసి) అంజలీ.. నీకు చలివేయడంలేదా?

అంజలి : నాకు, చలీ–వేడీ–ఆకలి,దప్పిక, నిద్ర, అలసట ఏవీ వుండవన్నయ్యా!

వేణు : ఎందువల్ల?

అంజలి : నేను చచ్చిపోయాను కదన్నయ్యా!

వేణు : అవును! చచ్చిపోయావు కదా! అవును నువ్వు బతికుంటే ఏం కావాలనుకున్నావ్?

అంజలి : కలెక్టర్ కావాలనుకున్నాను. ఎందుకంటే ఓసారి మా స్కూలుకి, జిల్లా కలెక్టరమ్మ వచ్చింది. ఆవిడ చాలా అందంగా ఉంది. ఎంతో తెలివైంది. ఆమెను చూసిన తర్వాత నాలో ఏదో కొత్త ఉత్సాహం మొదలైంది. నేనూ ఆమెలాగే కలెక్టర్ కావాలనుకున్నాను. ఆరోజు నుంచి కష్టపడి చదువుకున్నాను. కలలు కంటే అందుకు తగ్గట్టు కష్టం పడాలి కదా అన్నయ్య.

వేణు : కలలు కంటే కష్టంకూడా పడాలా?

అంజలి : (నవ్వి) నువ్వెప్పుడూ కలలు కనలేదా!

వేణు : దేన్నిగురించి కలలు కనే అవసరం నాకు రాలేదు. ఇంటర్‌లో ఫస్ట్ రావాలనుకున్నాను. మాడాడీకి చెప్పాను. ఏంచేసాడో, ఎంత ఖర్చుపెట్టాడో నాకు తెలియదు. ఫస్ట్ వచ్చాను. అడక్కుండానే బెంజ్‌కార్ కొనిచ్చాడు. అందుకే కలలేంటో, కష్టపడ్డాలేంటో నాకు తెలియవు!

అంజలి : కానీ కలలు కనడం, కష్టపడటం, వాటిని సాధించడం చాలా థ్రిల్‌గా ఉంటుందన్నయ్యా! కానీ నాకల, నీకారు కింద నలిగిపోయిందన్నయ్యా! అది నా బ్యాడ్‌లక్! నువ్వేం చేస్తావ్? నీకు రెండువందల స్పీడ్‌లో వెళ్తే థ్రిల్.. నాకు క్లాస్ ఫస్ట్ వస్తే థ్రిల్. ఇప్పుడు నా థ్రిల్‌కి చాన్స్ లేదు. గాన్.. పోయిచ్..

వేణు : (మాట్లాడలేదు)

అంజలి : అంతే? ఉన్నవాళ్ళు కారెక్కింతర్వాత ఎక్సలేటర్ తొక్కుతూనే ఉంటారు. కార్లున్న తర్వాత యాక్సిడెంట్లు అవుతూనే ఉంటాయి. జాగ్రత్త లేనివాళ్ళు కార్లకింద పడుతూనే వుంటారు.

వేణు : (హుషారుగా) సరిగ్గా ఇదేమాట మా డాడీకూడా అన్నాడు. నిజమేనంటావా?

అంజలి : మీ డాడీ అంటే నిజమే!

వేణు : నేనూ అదే అనుకున్నాను. నా తప్పు లేదనుకున్నాను!

అంజలి : బెంజ్‌కారు కింద పడటం నా తలరాత అనుకొని నేనుసమాధానపడ్డాను. మా అమ్మ పడలేకపోతుంది. పిచ్చిది, రోజంతా ఏడుస్తుంది.

వేణు : పాపం బాధ ఉంటుంది కదా! ఆవిడకేమైనా డబ్బు సాయం చేయమంటావా? ఎంతయినా సరే పంపిస్తాను.

అంజలి : డబ్బొద్దుగానీ, ఓ చిన్న సాయం చెయ్యన్నయ్యా!

వేణు : ఓ ఎస్! ఏంటో చెప్పు! తప్పకుండా చేస్తాను.

అంజలి : మా అమ్మకీ, అంజలిని తీసుకెళ్ళి ఇచ్చెయ్! ఎంతో సంతోషిస్తుంది!

వేణు : అదెలా కుదురుతుంది? నవ్వు చచ్చిపోయావు కదా!

అంజలి : నేను చచ్చిపోలేదన్నయ్యా! బెంజ్‌కారు చంపేసింది!

(భూతాల బంగా(రాజు హాల్లోకి వచ్చాడు. రెండు చేతుల్లో వేపమండలున్నాయి. భూతవైద్యుని వేషంలో ఉన్నాడు. చావిట్లో ఎవరూ లేరు. అతని కేకలు విని బయటికొస్తారు)

బంగా(రాజు : అల్లల్లభీర.. అశ్చరభశరభ.. అశ్చరభ శరభ.. (ఇంకా పెద్దగా) చిందులేస్తోంది.. ఈ గృహంలో చిందులేస్తోంది కొరివి దెయ్యం. అల్లల్లభీర.. అశ్చరభశరభ!

(కేకలకి ప్రభ వచ్చింది)

ప్రభ : వచ్చారా స్వామిగారు రండి!

బంగా(రాజు : అల్లల్లభీర-అశ్చరభశరభ! - కొరివి దెయ్యం ఉన్నచోట నేను కూర్చోను.

జే.కే. : అవును! పాస్టర్ ఏసుపాదం కూడా పవర్‌ఫుల్ దెయ్యమని చెప్పారు.

బంగా : క్రిస్టియన్ పాస్టర్ ఇక్కడ అడుగు పెట్టాడా? అందుకా నీ చిందులు! (అని అక్కడి దెయ్యాన్ని వేల్తో చూపిస్తూ అడిగాడు) (భార్యా, భర్తలు అటు భయంగా చూస్తాడు)

ప్రభ : క్రిష్ణ.. క్రిష్ణా.. ఆ పాస్టర్ రావడంవల్ల మరీ రెచ్చిపోయిందా స్వామీ!

బంగా : సందేహం లేదు. ఆ శక్తి హీనుణ్ణి చూసే ఈ శక్తి వీరంగమాడుతుంది.

ప్రభ : ఈయనే చెప్తే వినకుండా పాస్టర్‌ని తీసుకొచ్చారు!

బంగా : పులిని చూసి నక్కవాతలు పెట్టుకున్నట్లు.. మన మతాన్ని కాపీ కొడతారు పాస్టర్లు. జనాన్ని ఆకట్టుకోడానికి మన మతంలోంచి మంత్రాలు, తంత్రాలు వాళ్ళు దిగుమతి చేసుకుంటారు. మనం గంగా జలం అంటే, వాళ్ళు హెూలి వాటర్ అంటారు. వాళ్ళు మనల్ని ఎంత అనుకరించినా మొండిదెయ్యాలు వాళ్ళకి లొంగొద్దూ! ఇదిగో ఇలాగే తిరగబడతాయి!

జే.కే. : ఆ దెయ్యాన్ని తొందరగా సాగనంపండి. లేకుంటే అవాకులూ, చవాకులూ పేలుతుంది.

బంగా : అవునా!

జే.కే. : అవును స్వామీ! కొంపలంటుకుపోయే మాటలు మాట్లాడుతుంది.

బంగా : మాట్లాడుతుంది. దయ్యాలకాశక్తి ఉంటుంది. దానికి అన్ని విషయాలు తెలుస్తాయి. దాన్ని నేను కట్టడి చేస్తాను.

(ప్రభ, వేణుని చేయిపట్టుకొని తీసుకొస్తుంది, భూతాల రాజు వేణుకేసి పరీక్షగా చూశాడు. వేణుతో)

(గుడ్లు ఉరుముతూ) నీకా దయ్యం కనిపిస్తోందా?

వేణు : లేదండి!

బంగా : కనపడదూ! నన్ను చూసి దాక్కుంటుంది. కూర్చో! (వేణు సోఫాలో కూర్చున్నాక) ఇప్పుడు నేను ఈ మంత్ర పత్రాలతో నీకు రక్షణ వలయం కల్పిస్తాను. ఆ భూతాన్ని ఈ సీసాలో దింపుతాను. మూతపెట్టి మారణహోమం చేస్తాను. అల్లల్లభీరా.. అశ్చరభశరభా!

జే.కే. : అలాగే చెయ్యండి స్వామీ!

బంగా : మారణహోమం మాటలు కాదు. మొగిలిచర్ల దుర్గాదేవికి వేయి మాడలు ఇవ్వాలి. మంత్రంతో ఈ భూతాన్ని భూమిలో పాతిపెట్టి భూశయనం చేయించాలి. చాలా ఖర్చువుద్ది.

జే.కే. : ఎంతవుతుంది స్వామీ?

బంగా : ముగ్గురమ్మల పూజకి ముప్పై వేలవుతుంది.

జే.కే. : అలాగే, ఇదిగో స్వామి! (జేబులోనుండి కట్టలు తీసాడు)

(బంగార్రాజు పళ్లెంలో పత్రిపెట్టి పళ్ళెం చాపాడు.)

(జే.కే. కట్టలు పళ్ళెంలో పెట్టాడు)

బంగా : (పత్రాలు వేణుపై చల్లుతూ) అల్లల్ల భీరా.. అశ్చరభశరభ.. (కండ్లు మూసుకొని) అమ్మ దుర్గా, లలితాంబా, శాంభవీ, దుష్టనాశినీ, శిష్టరక్షిణీ.. ఈ పసివాడికి రక్షణ వలయం కల్పించు తల్లీ! అల్లల్లభీరా.. అశ్చరభశరభా.. (వాళ్ళకేసి చూసి) ఇప్పుడా రక్తాక్షిని ఇక్కడికి పిలిపిస్తాను.. భయపడకండి!

ప్రభ : క్రిష్ణ.. క్రిష్ణా.. మీరుండగా మాకేం భయం స్వామీ!

బంగా : అల్లల్లభీరా.. అశ్చరభశరభా.. రా.. దిగిరా.. బంగార్రాజు ఆజ్ఞ అయింది. రా..

(నో మ్యూజిక్.. సైలెన్స్‌గా ఉండగా)

ప్రభ,జే.కే. : వచ్చిందా స్వామీ (రహస్య స్వరంతో)

బంగా : మొండిఘటం. (వచ్చిందా అన్నట్లు అటూ ఇటూ చూసి) ఇంకా రాలేదు! (అన్నాడు) (స్వరం పెంచి) అల్లల్లభీరా.. అశ్చరభశరభా (సైలెన్స్ లోనుండి చిన్న డప్పు స్టోక్, అనుగుణంగా అడుగులేస్తూ అంజలి వచ్చింది) వచ్చావా? రా.. (ఇంకా స్వరం పెంచి) ఇలారా... ఇక్కడ కూర్చో! (నేల చూపిస్తే, అంజలి రెక్లెస్ ఎక్స్‌ప్రెషన్ ఇచ్చి సోఫాలో కూర్చుంది) అదీ అలా చెప్పింది చెయ్! చేతులు కట్టుకొని కూర్చో. (మళ్ళీ కేర్‌లెస్ ఎక్స్‌ప్రెషన్ ఇచ్చి, చేతులు సోఫాపై చాపి, కాలిమీద కాలేసుకుని కూర్చుంది) అదీ.. అలా బుద్ధిగా కూర్చో. అల్లల్లభీరా.. అశ్చరభశరభా.

ప్రభ, జే.కే : (ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటారు. ఇతనికి శక్తి ఉందన్నట్లు)

బంగా : (మంత్రాలు చదివి) కుండలి కంద నిలయా! రక్తబీజీ, అసురధ్వంసి! అపర్ణా, రా.. ఈ సీసాలో ప్రవేశించు! చెప్తున్నది బంగార్రాజు.. దుర్గాదేవీ! అపర్ణా రా.. అదీ అలా! (ఠప్ శబ్ధంతో సీసా మూత పెట్టాడు) దిగింది.. చాలా మొండిది. భలే శ్రమ పెట్టింది. (లేని

చెమట తుడుచుకుంటాడు) దీన్నిప్పుడు భూస్థాపితం చెయ్యాలి. నీ కొడుకుని రక్షించినందుకు సంతోషంగా, నాకు ఏం తాంబూలం ఇస్తావో ఇచ్చుకో!

(అంజలి బంగా(రాజు నెత్తిమీద మొట్టికాయ వేసింది. లోహపు శబ్ధం వచ్చింది)

అలా తట్టావేం బాబూ!

వేణు : అది తట్టుడు కాదు, కొట్టుడు!

అంజలి : అవును! (అని మళ్ళీ కొట్టింది)

బంగా : అబ్బా! ఏంటీ పరిహాసాలు?

అంజలి : నీ ప్రతిభకు పట్టాభిషేకం! (కొట్టింది)

బంగా : ఏంటిది? ఎవరది?

వేణు : అంజలియే కొడుతోంది!

బంగా : ఎలా కొడుతుంది? సీసాలో ఉందిగా!

వేణు : లేదు, నీ వెనకే ఉంది!

బంగా : ఆఁ.. (వెనక్కి చూస్తే ఏమీ కనిపంచదు) ఎక్కడా?

వేణు : అక్కడే ఉంది. తాంబూలం ఇమ్మంటుంది!

బంగా : మొత్తం ఇచ్చేయాలా?

అంజలి : (కొట్టింది)

వేణు : ఇచ్చెయ్యాలి!

బంగా : (వేణుకిచ్చాడు, ఏడుస్తూ)

ప్రభ : ఏమిటి స్వామీ! ఏమయింది?

బంగా : నా పిండాకూడయింది!

అంజలి, వేణు : నువ్వు భూతవైద్యుడివా? బంగా(రాజువా?

అంజలి : గడ్డాలు గీసుకునే గంగయ్యవి! నువ్వు భూతాలరాజువా! వెళ్ళిపో.. పారిపో!

వేణు :

అంజలి : (కొట్టింది)

బంగా : అమ్మో! (అంటూ పారిపోతుండగా)

ప్రభ, జే.కే : స్వామీ.. స్వామీ!

బంగా : అమ్మో! ఇది మామూలు దయ్యం కాదు, భూతం, మహాభూతం! (పారిపోయాడు)

ప్రభ, జే.కే. : ఆగండాగండి (అంటూ అతని వెనకాలే పరుగెత్తుకెళ్ళారు)

అంజలి : (డెడ్‌లైన్స్‌లో మెల్లగా నడుచుకుంటూ వేణుదగ్గరకొచ్చి) ఏం అన్నయ్యా! నిన్ను పీక్కుతింటున్నానా? నిన్ను భయపెడుతున్నానా? నీతో మాట్లాడుతున్నా! అంతే. దానికే కష్టంగా ఉందా? నామీద హోలీ వాటర్ చల్లిస్తున్నావ్, నన్ను భూమిలో పాతిపెట్టాలని చూస్తున్నావ్! నేను నీకు అంత అపకారం ఏంచేశాను? (స్వరం పెంచి అన్నాక)

వేణు : ఇవన్నీ చేయిస్తున్నది నేను కాదు, నా తల్లిదండ్రులు!

అంజలి : నువ్వొద్దని చెప్పి వుండొచ్చుగా?

వేణు : (మాట్లాడలేదు)

అంజలి : ఇవన్నీ అంటే నాకు భయంలేదు, కానీ నేను నీతో ఎంతమంచిగా వున్నా నన్ను మట్టుబెట్టాలని ఎందుకు చూస్తున్నావ్? నిజం చెప్పన్నయ్యా!

వేణు : నువ్వు నావెంటే వుంటే ఇబ్బందిగా వుంది. నేను కాలేజీకి వెళ్ళాలి. స్నేహితుల్తో ఆడుకోవాలి.

అంజలి : మందుతాగాలి.. అమ్మాయిల్ని ఏడిపించాలి!

వేణు : అదేం కాదు, నీవల్ల నా చదువు పాడవటం, ధర్మం కాదుకదా!

అంజలి : క్లాసులో ఫస్ట్ వచ్చేదాన్ని. అలాంటిది నా చదువు, పాడయిందిగా అది ధర్మమా? (సైలెన్స్) అవును ధర్మం అంటే ఏమిటన్నయ్యా!

వేణు : ధర్మమంటే.. అది ధర్మమే!

అంజలి : అంటే ఏమిటన్నయ్యా!

వేణు : నేను చెప్పలేను! పోనీ నువ్వు చెప్పగలవా?

అంజలి : నేనూ చెప్పలేను. కానీ ఆగస్ట్-15 నాడు మా స్కూలుకి వచ్చిన కలెక్టరమ్మ ధర్మం గురించి గొప్పగా చెప్పింది. ఏం చెప్పిందబ్బ... ఆఁ! ఈ దేశంలో పుట్టడం మన అదృష్టం. ధర్మమే మన దేశానికి పునాది అని చెప్పింది.

వేణు : ఆవిడ చాలా మంచి మాట చెప్పింది!

అంజలి : అదే, మేమూ అనుకున్నాం! జండావందనం అయిన తర్వాత ఆవిడకి మార్చ్‌ఫాస్ట్ చేస్తూ సెల్యూట్ కొట్టాము. లెఫ్ట్ రైట్.. లెఫ్ట్ రైట్.. లెఫ్ట్ రైట్.. కమాన్!

వేణు : లెఫ్ట్ రైట్.. లెఫ్ట్ రైట్.. లెఫ్ట్ రైట్..(లోనికెళ్తారు)

ప్రభ : క్రిష్ణ..క్రిష్ణా.. ఏంటండీ ఈ పిచ్చి! రోజు రోజుకీ వీడి చేష్టలు శృతిమించుతున్నాయ్!

జే.కే. : ఏంచేయాలో నాకూ అర్థం కావడంలేదు. పాస్టర్ ఏం చేయలేకపోయాడు. భూతవైద్యుణ్ణి పరుగులు పెట్టించింది!

ప్రభ : క్రిష్ణ..క్రిష్ణా.. అయితే మనమేం చేయలేమా?

జే.కే. : చెయ్యాలి! చేతికందొచ్చిన కొడుకుని చేజార్చుకోలేం. దీనికి చెక్ నేను పెడతాను!

పద్దాలు : (బయటినుండి) సార్.. సార్.. (అని పిలిచింది)

ప్రభ : (బయటికెళ్ళి చూసి వచ్చి) మన డ్రైవర్ భార్య పద్దాలు! రా పద్దాలు.. అవునూ మీ ఆయనేంటి? పనిలోకి రావడంలేదు!

పద్దాలు : మీకు తెలీదా? అయ్యగారుకి తెలుసే!

ప్రభ : ఏంటండదీ?

జే.కే. : తర్వాత చెబుతా! నువ్వు లోపలికెళ్ళు!

ప్రభ : (అయిష్టంగా లోనికెళ్ళింది)

జే.కే : ఎందుకొచ్చావ్?

పద్దాలు : అదేంటి? అలా అనేసారు? నా మొగుణ్ణి జైలుకి పంపేటప్పుడు మా కుటుంబం మంచి చెడ్డా మీరే చూసుకుంటామన్నారుగా!

జే.కే. : చూసుకున్నాను. చాలా డబ్బు ఖర్చు చేసాను. ప్రతిదానికీ నామీద పడితే నేనేం చెయ్యను?

పద్దాలు : నా మొగుడు మీకోసం జైలుకెళ్ళాడు. ఇంట్లో ఉన్న ఒక మగ వెధవ బాధ్యత లేకుండా జులాయిగా తిరుగుతున్నాడు. అసలు ఇప్పుడు ఇంటికే రావటం లేదు. ఏమయిపోయేడో వయసొచ్చిన పిల్ల ఇంట్లో ఉండటంతో రౌడీ వెధవలంతా, ఇంటిచుట్టూ తిరుగుతున్నారు. ఈ స్థితిలో అలా అంటే ఎలా బాబూ!

ప్రభ : (బయటికొచ్చింది)

జే.కే. : మరేమనమంటావ్? గాలికి తిరిగే నీ కొడుకుని, ఎక్కడున్నాడో వెతకమంటావా? నీ కూతురుకోసం రౌడీ వెధవలు ఇంటిచుట్టూ తిరుగుతుంటే, నన్ను కర్రపట్టుకుని కాపలా కాయమంటావా?

పద్దాలు : అని నేనెందుకంటాను? నా మొగుడే ఇంట్లో ఉంటే ఆయనే మంచీ, చెడ్డా చూసుకునేవాడు. ఆయన్ని ఇంట్లో లేకుండా చేశావ్!

జే.కే. : ఏంటే కొడుకుని సరిగ్గా పెంచడం చేతగాని దద్దమ్మవి. నువ్వా మాట్లాడేదానివే.. వెళ్ళు! ఇక్కడ్నించి! వెళ్ళు...

పద్దాలు : నేను కొడుకుని సరిగ్గా పెంచలేని దద్దమ్మనే. కానీ మీరేమంత గొప్పగా పెంచారు? మీ కొడుకుని! మీరు నీతిగా పెంచితే యాక్సిడెంట్ చెయ్యగానే, తిన్నగా పోలీస్ స్టేషన్ కే వెళ్ళేవాడు. తన నేరం ఒప్పుకునేవాడు. అలా కాకుండా ఇంటికొచ్చి నేరం నామొగుడిమీద వేసి, నామొగుణ్ణి జైలుకి పంపేవాడుకాదు! (అంజలి + వేణు ప్రవేశం)

ప్రభ : ఏంటి? నాకొడుకు యాక్సిడెంట్ చేశాడా?

పద్దాలు : అవును, నీకొడుకు యాక్సిడెంట్ చేశాడు. రెండు వందల స్పీడ్‌తో వెళ్ళి పదేండ్ల పిల్లని గుద్దేసి, అప్పుడంలా కారుకింద అణిచేసి, అరమైలు దూరం ఈడ్చుకెళ్ళిమరీ చంపాడు.

ప్రభ : క్రిష్ణ...క్రిష్ణా.. నా వేణు ఓ ప్రాణం తీశాడా? నేను నమ్మను!

పద్దాలు : లేదమ్మా! చంపింది మీ కొడుకే!

జే.కే. : అబద్ధం. చంపింది నీ మొగుడే. అందుకే పోలీసులు అరెస్ట్ చేసి తీసుకెళ్ళారు.

పద్దాలు : కాదమ్మా! సారే నా భర్తని ఆ నేరం ఒప్పుకోమన్నారు. మీ కొడుకు బదులు జైలుకెళ్ళమన్నారు. మా సంసారాన్ని అన్నివిధాల ఆదుకుంటామన్నారు. కానీ ఆదుకోవటం లేదు, నా కొడుకు ఇల్లొదిలి పారిపోయాడు. వయసుకొచ్చిన నా బిడ్డ పదిమందిలో అల్లరయ్యేలా ఉంది. మా బతుకులు బజారుపాలయ్యాయమ్మా!

జే.కే. : అబద్ధం, అది చెప్పేవన్నీ అబద్ధాలే!

పద్దాలు : అబద్ధాలతో నాకుటుంబాన్ని నేనే అల్లరిపాలుచేసుకుంటానా? నేను చెప్పేదే నిజం! కావాలంటే నిజమేంటో మీకొడుకునే అడగండి!

ప్రభ : వేణూ! పద్దాలు చెప్పేది నిజమేనా?

అంజలి : (వేణు తల తిప్పుకున్నాడు) అర్థమైందా అన్నయ్యా నీవల్ల రెండు కుటుంబాలు నాశనమయ్యాయి!

వేణు : రెండు కుటుంబాలా?

అంజలి : నాకు యాక్సిడెంట్ చేసావ్, మా అమ్మ పిచ్చిదైంది. దాంతో మా కుటుంబం నాశనమైంది. ఇక డ్రైవర్ జైలుకెళ్ళాడు. కొడుకు పారిపోయాడు. ఆడపిల్ల అల్లరవుతోంది అంటే ఆ కుటుంబం కూడా పూర్తిగా నాశనమైనట్లేగా!

వేణు : (తలొంచుకున్నాడు)

ప్రభ : ఏం మాట్లాడవేం? తలొంచుకుంటావేంటి?

జే.కే. : కన్నతల్లే అనుమానిస్తుంటే ఏం చేస్తాడు? బాధతో తలొంచుకున్నాడు. పద్దాలూ..నీ మొగుడు నా డ్రైవరు! ఏది ఏమైనా అతని కుటుంబాన్ని కాపాడవలసిన బాధ్యత నాకుంది. కాపాడతాను. నేను నీ కొడుకుని వెతికిస్తాను. నువ్వెళ్ళు!

పద్దాలు : తొందరగా ఎతికించండి బాబు!

జే.కే. : వెతికిస్తానన్నానుగా... నన్ను నమ్ము! వెళ్ళు!
(పద్దాలు వెళ్ళింది)
(ప్రభతో) నువ్వుకూడా నోరుమూసుకుని లోపలికెళ్ళు!

ప్రభ : ఎంతకాలం నా నోరు మూయిస్తారు? మీ వ్యాపారాలకి నేను అడ్డం పడలేదు. మీ ఆలోచనలకి అడ్డంపడలేదు. చివరికి మీ తిరుగుళ్లకి నేను అడ్డంపడలేదు. క్రిష్ణ..క్రిష్ణా అంటూ కండ్లు మూసుకున్నాను. ఇప్పుడు నా ఒక్కగానొక్క కొడుకుని మీ చెడు దారిలోకే మళ్లిస్తుంటే కూడా చూస్తూ నోరుమూసుకోలేను!

చెప్పు వేణూ.. నువ్వు ఆ యాక్సిడెంట్ చేశావా? లేదా? చెప్పు!

జే.కే. : నువ్వు చెప్పకురా!

ప్రభ : ఈ అమ్మమీద నీకు ఏమాత్రం గౌరవం ఉన్నా నా తలమీద చెయ్యివేసి చెప్పు! నువ్వు యాక్సిడెంట్ చేసావా లేదా? (చాలా ఎమోషనల్‌గా అడిగింది)

వేణు : చేసానమ్మా! (తలొంచుకున్నాడు)

ప్రభ : ఆ కేసులోనే కదా మన డ్రైవర్ జైలుకెళ్ళింది?

వేణు : అవును! (చేయి వెనక్కి తీసుకున్నాడు)

ప్రభ : క్రిష్ణ..క్రిష్ణా.. నాకడుపున పుట్టి, ఇంత దుర్మార్గానికి ఎలా తలపడ్డావురా?
(అంటూ గుండె పట్టుకుని వాలిపోతుంది)

వేణు : అమ్మా... అమ్మా (అంటూపడిపోకుండా పట్టుకున్నాడు)

జే.కే. : ప్రభా... ఏమయింది ప్రభా.. మాట్లాడవేంటి?

వేణు : అమ్మా మాట్లాడమ్మా!

జే.కే. : ఏమయింది చెప్పు!

ప్రభ : ఇక్కడ నొప్పిగా ఉంది. ఊపిరి ఆడటం లేదు!
(ఇద్దరూ కలిసి సోఫాలో కూర్చోబెట్టారు)

జే.కే. : కంగారు పడకు! డాక్టర్‌ని పిలిపిస్తాను! (జే.కె. ఫోన్ దగ్గరికి పరుగెత్తాడు)

**లైట్స్ ఆఫ్**

## సీన్ నెం.5

## (జేకే ఇల్లు)

జే.కే. : (పేషెంట్ గదిలోనుండి బాధగా బయటికొచ్చాడు. సోఫాలో కూర్చున్నాడు. ఎదురుగా ఉన్న ఫైలు తెరిచాడు. ఇంతలో ఫోన్ మోగింది) హలో! (విసుగ్గా) ఏంటి పార్వతీ! ఇప్పుడు అవన్నీ మాట్లాడకు! మూడ్ లేదు. నా భార్యకు ఒంట్లో బాగులేదు. షటప్! నా భార్య అని చెబుతున్నాను కదా! అవును. ఆవిడంటే నాకు చాలా సెంటిమెంట్. (ఫోన్ కట్ చేసి) ఆ విషయం నాకింతవరకూ అర్థం కాలేదు! (ఆ మూడ్‌లోంచి బయటకొచ్చి ఫైల్ చూస్తున్నాడు)

వేణు : (మేడపైనుండి వచ్చి) అమ్మకెలా ఉంది నాన్నా?

జే.కే. : అలాగే వుంది. హార్ట్ ఎటాక్ కదా! ఇంకో 24 గంటలు గడిస్తేగాని డాక్టర్‌లేమీ చెప్పలేమన్నారు. ఛ.. నావల్లే ఇదంతా జరిగింది. (ఫైలు మూసి, టైం చూసుకుని) నేను ఆఫీస్ వరకూ వెళ్ళొస్తాను. కొన్ని ఇంపార్టెంట్ పేపర్స్‌పై సంతకాలు చేయాలి. నువ్వింట్లోనే ఉంటావుగా!

వేణు : ఉంటా డాడీ! మీరు వెళ్ళి రండి. (తండ్రితో గుమ్మం వరకూ వెళ్ళి, తిరిగి పేషంట్ గదిలోకి వెళ్లాడు. తల్లిని చూసి, కన్నీళ్లతో తల నిమిరి, కండ్ల నీళ్లతో బయటకొచ్చి, విచారంగా సోఫాలో కూర్చున్నాడు)

అంజలి : (వచ్చి, కూర్చుని అతణ్ణే చూస్తుంటుంది)

వేణు : (కన్నీళ్లు తుడుచుకొని) అంజలీ నాకీ కన్నీళ్ళెందుకొస్తున్నాయి?

అంజలి : బాధతో!

వేణు : అసలు బాధ ఎందుకు కలుగుతుంది?

అంజలి : (మాట్లాడదు!)

వేణు : నాకెప్పుడూ ఏ విషయంలోనూ బాధ అనిపించలేదు. ఈ విషయంలో ఎందుకు బాధ అనిపిస్తుంది.

అంజలి : ఆత్మీయులు దూరమవుతారనే ఆలోచనతో భయం కలుగుతుంది. ఆ భయంలోనుంచే బాధ పుడుతుంది.

వేణు : దూరమవుతారనే ఆలోచనకే, ఇంత బాధగా ఉంటే, నిజంగా దూరమైతే ఎంత బాధగా వుంటుందో!

అంజలి : ఈ బాధకంటే ఎన్నో రెట్లు ఎక్కువ బాధ ఉంటుందన్నయ్యా!

వేణు : అవునా?

అంజలి : ఆ దుఃఖ అనుభవించిన వాళ్ళకే అర్థమవుతుందన్నయ్యా!

వేణు : (ఆలోచించి) నువ్వు దూరమైనప్పుడు మీ అమ్మ ఎంతో బాధతో ఏడ్చి ఉంటుంది కదా!

అంజలి : ఏడ్చింది, చాలా ఏడ్చింది. ఏడ్చి ఏడ్చి పిచ్చిదైపోయింది!

వేణు : అవునా? ఏడుపనేది నాకు తెలియదు! అదేదో తెలియకుండానే నేను పెరిగాను. నా ఎదురుగా ఇందాక ఆ డ్రైవర్ భార్య ఏడుస్తుంటే నాకేదో బాధ అనిపించింది.

అంజలి : (ఆశ్చర్యంగా...నవ్వుతూనే) నీకితరుల బాధ తెలుస్తుందా?

వేణు : తెలుస్తుంది.. మీ అమ్మగారి బాధా తెలిసింది, డ్రైవర్ భార్య దుఃఖః అర్ధమైంది. (అంటూ తల వంచుకున్నాడు)

అంజలి : (భుజం మీద చెయ్యివేసి) బాధపడకన్నయ్యా! మా స్కూల్లో తెలుగు మేస్టారు మహాభారతం మొత్తంలో ఒకే ఒక నీతి తప్పక నేర్చుకోవాలి అనేవారు. ఒక పద్యం చదివేవారు, అర్ధం చెప్పేవారు.

అంజలి : ఇతరులు ఏంచేస్తే నువ్వు బాధపడతావో, అది నువ్వు ఇతరులకు చెయ్యకు అని చెప్పేవారు.

వేణు : నిజమే! నువ్వు నన్ను చంపేస్తే, నేను బాధపడతాను కదా! అంటే నేను నిన్ను చంపకూడదు. (ఆలోచించి) కానీ చంపేశానుగా!

అంజలి : (అతని భుజం తట్టి) బాధపడకన్నయ్యా! నిజం చెప్పేవ్. అదిచాలు. ఇదంతా మా ఖర్మ. నువ్వేం చేస్తావ్?

వేణు : ఎన్నో ఆశలతో వికసించడానికి సిద్ధంగా నీ జీవితాన్ని మొగ్గలోనే తుంచేసాను. లేకుంటే నువ్వెంత గొప్పదానివై ఉండేదానివో! తప్పు నాది, శిక్ష మీది అయింది. ఇందరి జీవితాలు నాశనం చేసిన నాకు శిక్ష పడాలి. (అని ల్యాండ్‌లైన్ ఫోన్ దగ్గరకి వెళ్ళాడు) (డయల్ చేసి) పోలీస్ కమిషనర్ ఆఫీసా? యస్.. నాపేరు వేణు! జే.కే.గారి అబ్బాయిని. కమిషనర్ గారికి కనెక్షన్ ఇవ్వండి. ప్లీజ్! వారితోనే మాట్లాడాలి. కాలేజిరోడ్‌లో జరిగిన యాక్సిడెంట్ గురించి నిజం చెప్పాలి. ప్లీజ్! (ఫోన్ కట్ చేసాడు)

అంజలి : ఏ నిజం చెప్తావన్నయ్యా!

వేణు : యాక్సిడెంట్ చేసింది నేను అని చెప్తాను!

అంజలి : అలా చెబితే నువ్వు ఆపదలో పడతావ్!

వేణు : నేను చేసిన తప్పుకి, నేను ఆపదలోపడ్డా పరవాలేదు. నిజం చెప్పాలి.
(ఫోన్ మోగింది)

వేణు : హలో.. కమిషనర్‌గారా? నమస్కారమండి. నాపేరు వేణు, కాలేజిరోడ్‌లో జరిగిన యాక్సిడెంట్ చేసింది నేనే! పదేండ్ల అమ్మాయిని, నా కారుతో తొక్కేసి చంపింది నేనే! అలాగే సార్! మీ ఆఫీసుకొచ్చి రాసిస్తాను సార్! సరే! మీరే మీ పోలీసులని పంపండి.

జే.కే. : ఎవరికిరా ఫోను? (బయటినుంచి వచ్చి)

వేణు : పోలీస్ కమిషనర్‌కి!

జే.కే. : ఆయనకెందుకు ఫోన్ చేసావ్?

వేణు : నిజం చెప్పడానికి! నేనే యాక్సిడెంట్ చేసిన విషయం కమీషనర్ గారికి చెప్పేశాను.

జే.కే. : నీకేం బుద్ధిలేదా?

వేణు : బుద్దొచ్చింది. అందుకే నిజం ఒప్పుకున్నాను.

జే.కే : జైలుశిక్ష పడుతుంది తెలుసా? ఇంతవరకు నిజం దాచి పెట్టినందుకు – శిక్ష ఇంకా ఎక్కువగా పడుతుంది.

వేణు : పడనియ్! తప్పు నేను చేసి, జైలుకి మరొకరిని పంపించలేను! నా తప్పుకు ఆ డ్రైవర్ కుటుంబం, నాశనం కావడానికి వీల్లేదు. అన్యం పుణ్యం తెలియని పసిపిల్లను నేను చంపేసాను. ఆ అమ్మాయి ప్రాణాలు ఎటూ తిరిగి తీసుకురాలేను. ఆ పిల్ల నాతో తన ఆశలు, ఆశయాలు చెబుతుంటే నా గుండె కరిగిపోయింది. నా తప్పుకి నేను శిక్షించబడాలి.

జే.కే. : వేణు! ఏమిటా పిచ్చి మాటలు. నువ్వు జైలుకెళితే, నేను మీ అమ్మ అనాధలవుతాం. నువ్వుకాక మాకింకెవరు ఉన్నారు?

వేణు : అంజలి తల్లికి మాత్రం, ఎవరున్నారు?

జే.కే. : నీలో ఈ కొత్త ఆలోచనలు – ఆ దెయ్యమే ప్రవేశపెట్టిందా?

వేణు : అంజలి దెయ్యం కాదు. నేను నాశనం చేసిన ఒక జీవితం. అంజలి ఆశల్ని, భవిష్యత్‌ని నేను నాశనం చేసికూడా, నా తప్పేం లేదని, నేను వాదిస్తుంటే – నా తప్పు నాకు తెలియజేసి, నా కళ్లు తెరిపించటానికొచ్చిన దేవత అంజలి.

జే.కే. : నువ్వు తప్పే చేసి ఉండచ్చు. కానీ ఇంతడబ్బు ఉండి కూడా – నేను నిన్ను కాపాడుకోలేకపోతే ఎలా?

వేణు : నీ డబ్బుతో నన్ను కాపాడగలవు డేడీ. కానీ, అంజలి ప్రాణాన్ని తిరిగి కొనగలవా?

జే.కే. : (మాట్లాడలేదు. ఓ క్షణం తర్వాత) కొనలేను...

వేణు : జీవితంలో మంచి చెడ్డలు నాకర్ధమయ్యేలా చేసిన అంజలికి నేను కృతజ్ఞతలు చెపుతూ, నేను జైలుకెళ్లాల్సిందే.

అంజలి : (నిట్టూర్చి) నువ్వు తొందరపడుతున్నావేమో అన్నయ్యా!

వేణు : లేదమ్మా! ఇప్పటికే చాలా ఆలస్యం చేసాను. నువ్వు రాకపోతే, నాలో ఈ మార్పు వచ్చేది కాదు.

అంజలి : నీకు శిక్ష పడాలని నేను రాలేదన్నయ్యా! జనం అడ్డూ అదుపూ లేకుండా వాహనాలు నడుపుతున్నారు. వాళ్ళ జీవితాలను వాళ్లే నాశనం చేసుకుంటున్నారు. నాబోటివారి జీవితాలను అర్ధాంతరంగా చిదిమేస్తున్నారు. అలాంటివాళ్ళకి నీద్వారా సందేశం ఇప్పించాలని వచ్చాను. నీలో మానవత్వం ఇంకా చావలేదని గమనించాను, అందుకే నీదగ్గరకొచ్చాను. నాకోసం నువ్వు, పోలీసులకి లొంగిపోవలసిన పనిలేదు!

(తల్లి శాలువా వేసుకొని వచ్చింది)

వేణు : నేను లొంగిపోయేది నీకోసం కాదు, నా మనశ్శాంతి కోసం. మా డాడీ నన్ను జైలు శిక్షనుంచి తప్పించవచ్చు కానీ, నా అంతరాత్మ శిక్షనుంచి తప్పించలేడు. తప్పు చేసి, తప్పించుకున్నాననే, అపరాధభావంతో జీవితం అంతా బతకలేను. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను.

ప్రభ : (మెల్లిగా దగ్గరికొస్తూ) మంచి నిర్ణయం తీసుకున్నావ్ వేణు!

వేణు : అమ్మా! నువ్వు కదలడం ప్రమాదం! ఎందుకొచ్చావ్!

ప్రభ : ప్రమాదం ముంచుకువస్తే మాత్రం ఏం? రానివ్వు! నాకొడుకు తప్పు ఏదో, ఒప్పు ఏదో, తెలుసుకున్నాడనే ఆనందంతో పైకెళ్లిపోయినా పరవాలేదురా!

వేణు : అమ్మా! థాంక్స్ అమ్మా! నా నిర్ణయాన్ని ఆమోదించినందుకు థాంక్స్.

(జే.కే. నిరాశగా చూశాడు)

డాడీ! ఈ కొద్దిపాటి ఎడబాటుకే మీరింతగా బాధపడుతున్నారే! అంజలిని శాశ్వతంగా పోగొట్టుకున్న వాళ్ళ అమ్మ ఎంత బాధపడుతుందో ఆలోచంచండి! ఆమెతో పోలిస్తే మీ బాధ ఎంత?

జే.కే. : (చేతులు పట్టుకొని నొక్కేడు) యా!

అంజలి : నేను వెళ్తానన్నయ్యా! ఇక నీకు కనిపించను!

వేణు : నా చెల్లెలు నాకు దూరమైతే ఎలాగమ్మా!

అంజలి : అన్నయ్యా – వెళ్తున్నా – తప్పదు! నీ తప్పు నువ్వు తెల్సుకున్న తర్వాత ఇంకా నేనిక్కడ ఉంటే అది నా తప్పు.

వేణు : అయితే తప్పదా, వెళ్లిపోతావా అంజలీ?

ప్రభ : నువ్వు నాకు కనపడకపోయినా, నా బిడ్డలో మార్పు తెచ్చావ్. వాడికి తోబుట్టువు అయ్యేవ్. నీ ఋణం తీర్చుకోలేనిది. నీ తల్లినుంచి నిన్ను దూరం చెయ్యడంలో మా వేణు తప్పేకాదు, తల్లిదండ్రులుగా మా తప్పుకూడా ఉంది. వాడ్ని అలా పెంచినందుకు వాడితోపాటు మమ్మల్ని కూడా క్షమించమ్మా!

అంజలి : (నవ్వి) అందరికీ సెలవు! బాయ్! (అంజలి వెళ్ళిపోయింది)

(ప్రభ కనపడకపోయినా – నమస్కరించింది. ఇంతలో సెల్‌ఫోన్ మోగింది.)

జే.కె. : సెక్యూరిటీనా చెప్పు – పోలీసులా? పంపించు.

(జే.కె. భారంగా వేణుని కౌగలించుకున్నాడు)

## – శుభం –